

నాందేడ్ జిల్లా బోకర్ తాలూకాలో ప్రమాదానికి గురైన కారు

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ కానరాని లోకానికి..

- రాష్ట్ర సరిహద్దులో ఘోర రోడ్డు ప్రమాదం
- నిలిపి ఉన్న లారీని ఢీ కొట్టిన కారు
- కారులోని ముగ్గురు దుర్మరణం, ఇద్దరికి తీవ్ర గాయాలు
- మృతుల్లో భార్య భర్తలు, మరో మహిళ

భైంసా, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా భైంసాలోని రాష్ట్ర సరిహద్దుల్లోని నాందేడ్ జిల్లా బోకర్ తాలుకా పరిధిలోని నాంద గ్రామ సమీపంలో బుధవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనలో నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజక వర్గ పరిధిలోని వర్ని మండలం హుమ్నాబాద్ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఘటన స్థలిలోనే దుర్మరణం పాలయ్యారు. గ్రామానికి చెందిన పలు కుటుంబాలు మూడు కార్లలో మహారాష్ట్రంలోని మహోర్ దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఇందులో నుంచి ఒక కారు అక్కడి ప్రాంతంలో ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి ఢీకొట్టడంతో ఘటన జరిగినట్లుగా సమాచారం. కారులో ప్రయాణిస్తున్న బుల్లి రాజు(55), సునీత(41), అనే భార్య భర్తలతో పాటు మరో మహిళ వాణి(41)లు దుర్మరణం పాలయ్యారు. కారు నడిపిస్తున్న శేఖర్‌తో పాటు నీలిమ అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి.

మిగతా 8వ పేజీలో...

5న గ్రామ పాలన అధికారులకు నియామక పత్రాలు

- సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అందజేత
- జిల్లా నుంచి 301 మంది జీపీవోల ఎంపిక 8

ఏఎంసీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా గంగారెడ్డి

మోపాల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ కమిటీ చైర్మన్ల ఫోరం అధ్యక్షుడిగా జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మేడ్చల్‌లో జరిగిన రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌ల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్‌ను ఫోరం అధ్యక్షుడిగా ఎన్నుకోవడం పట్ల జిల్లా కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



నాడు డి. శ్రీనివాస్‌పై వేటుకు యత్నం..

2018లో పీసీసీ మాజీ అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు డి.శ్రీనివాస్‌ను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలని జిల్లా నాయకులందరిచేత సిఫారసు చేయించిన కవిత.. నేడు పార్టీ నుంచి తానే సస్పెండ్ కావడం గమనార్హం. రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు, ప్రస్తుత రూరల్ ఎమ్మెల్యే, అప్పటి ఎమ్మెల్సీ భూపతిరెడ్డికి మధ్య తగాదా జరగగా అప్పుడు భూపతిరెడ్డిని సైతం పార్టీ నుంచి సస్పెండ్ చేయించి ఆ ఎమ్మెల్సీ పదవిని కవిత సొంతం చేసుకున్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికలకు ముందు డీఎస్ తనయుడు, ప్రస్తుత ఎంపీ అర్వింద్ ధర్మపురి బీజేపీలో చేరగా బీఆర్ఎస్‌లో ఉన్న డీఎస్‌ను సస్పెండ్ చేయాలని పార్టీ అధినేత కేసీఆర్‌కు కవిత జిల్లా నాయకులందరి చేత ఒత్తిడి తెచ్చి లేఖ రాయించారు. అయితే చాలా మంది డీఎస్‌పై సస్పెన్షన్ సిఫారసులను జీర్ణించుకోలేకపోయారు. ఇప్పుడు తన తండ్రి స్థాపించిన పార్టీ నుంచి కవితను సస్పెండ్ చేయడంతో గతంలో ఆమె జిల్లాలోని నాయకులను సస్పెండ్ చేయించిన ఘటనలను గుర్తుకు తెస్తోంది.



అయ్యో.. కోడలా..

బీఆర్ఎస్‌లో ముగిసిన కవిత కథ

- నాడు డీఎస్ సస్పెన్షన్ కోసం పట్టు... నేడు తనపైనే బహిష్కరణ వేటు
- పార్టీ సభ్యత్వానికి, ఎమ్మెల్సీ స్థానానికి రాజీనామా
- కలిసిరాని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవి
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక తప్పదా?
- ఉమ్మడి జిల్లాలో ఒంటరైన కవిత

జిల్లాకు చెందిన కోడలు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారాల పట్టి కల్వకుంట్ల కవిత ప్రస్థానం బీఆర్ఎస్ పార్టీలో ముగిసింది. పార్టీ వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని కవితను మంగళవారం పార్టీ నుంచి సస్పెండ్ చేసిన నేపథ్యంలో బుధవారం ఆమె బీఆర్ఎస్ సభ్యత్వానికి, నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి రాజీనామా చేశారు. తండ్రితో పాటు తెలంగాణ ఉద్యమంలో అన్నీ తానై వ్యవహరించినా.. చివరికి 'పుట్టింటికి' దూరమయ్యారు.

నిజామాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ జాగృతి పేరుతో ఊరూరా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తూ తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిన కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడం తీవ్ర చర్చకు దారి తీసింది. కొత్త పార్టీ పెడతారా..? వేరే పార్టీలో చేరుతారా అనే విషయంపై స్పష్టత లేకపోగా జిల్లాలో మాత్రం ఆమె ఒంటరైన పరిస్థితి నెలకొంది. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేతలు ఎవరూ పాల్గొనలేదు. కేవలం కొద్దిమంది జాగృతి కార్యకర్తలు తప్ప.. జిల్లా నుంచి పెద్దగా నాయకులెవరూ ఆమె వెంట కనిపించలేదు. ఒకప్పుడు బీఆర్ఎస్ జిల్లా పార్టీని తన కనుసన్నలతో నడిపిన కవిత నేడు ఒంటరైన పరిస్థితి ఆమె స్వయంకృపరాధమే.

జిల్లాలో ఒంటరైన కవిత...

బీఆర్ఎస్ అంటే కవిత... కవిత అంటే బీఆర్ఎస్ లాగా ఉన్న పార్టీలో ప్రస్తుతం ఆమె ఒంటరైన పరిస్థితి ఉంది. పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ మంగళవారం పార్టీ నిర్ణయం తీసుకున్న తర్వాత జిల్లాలో ఏ ఒక్క నాయకుడు కూడా ఆమె వైపు మాట్లాడలేదు. మరోవైపు ఆమె సస్పెన్షన్‌ను సమర్థిస్తూ సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు పోస్టులు చేయడం ఆమె జిల్లాలో ఒంటరినే భావనను కలిగించాయి. బుధవారం ఆమె పార్టీతో పాటు ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో జిల్లాలో ఏ ఒక్క బీఆర్ఎస్ నాయకులు బహిరంగంగా మాట్లాడులేదు. ఆమెకు మద్దతుగా నిలువలేదు.


ఉప ఎన్నిక తప్పదా..?

ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న కవిత బుధవారం ఆ పదవికి రాజీనామా చేస్తూ శాసన మండలి చైర్మన్‌కు లేఖ పంపించడంతో ఆ స్థానానికి ఉప ఎన్నిక వచ్చే అవకాశం ఉంది. ఇంకా మూడున్నర ఏళ్ల పాటు ఎమ్మెల్సీ పదవి కాలం ఉంది. శాసన మండలి చైర్మన్ రాజీనామాను ఆమోదిస్తే ఈ స్థానానికి ఉప ఎన్నిక వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థలు లేకపోగా మున్సిపల్, కార్పొరేషన్ల పాలక వర్గాలు లేవు. ఈ నెల చివరిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు పూర్తయితే తప్ప స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహించే అవకాశాలు లేవు. రాజీనామా ఆమోదం తర్వాత ఆరు నెలలలోపు ఎన్నిక నిర్వహించాల్సి ఉండటంతో ఆలోపు ఎన్నికలు పూర్తయ్యే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటిన బీజేపీ, ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలు ఈ సీటుపై కన్నేసే అవకాశాలు ఉన్నాయి.

బీఆర్ఎస్‌లో ముగిసిన ప్రస్థానం..

జిల్లా కోడలిగా సుపరిచితురాలైన కవితను జిల్లా ప్రజలు ఆదరించారు. 2014 తెలంగాణ ఏర్పడిన తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఆమెను భారీ మెజార్టీతో గెలిపించారు. ఆ తర్వాత ఐదేళ్ల పాటు కవిత జిల్లాలో తిరుగులేని నాయకురాలిగా ఎదిగారు. ఆమె జోక్యాన్ని నచ్చని అప్పటి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు తర్వాత 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఆమెకు సహకరించకపోవడంతో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత ఆమె 2020లో నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అయ్యారు. 2022లో తిరిగి ఎమ్మెల్సీగా గెలుపొందారు. అతర్వాత జరిగిన పరిణామాలతో ఆమె జిల్లాకు అంటి ముట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు. లిక్కర్ కేసులో జైలుకు వెళ్లడంతో 2024 పార్లమెంట్ ఎన్నికలో పోటీ చేయలేదు. తెలంగాణ ఉద్యమంలో జిల్లాలో క్రియాశీలక పాత్ర పోషించిన

మిగతా 8వ పేజీలో...



ముస్సిపల్ కార్పొరేషన్‌పై అవినీతి మరక

- ట్రేడ్ లైసెన్స్ కోసం లంచం తీసుకుంటూ పట్టుబడిన ఇన్‌చార్జి ఆర్‌ఐ
- గత ఏడాది ఆగస్టులో పట్టుబడిన ఆర్‌ఐ నరేందర్
- డబ్బులు ఇస్తేనే కార్పొరేషన్‌లో పనులు
- ఏళ్ల నుంచి తిష్టవేసిన అధికారులు
- దొరకని పెద్ద చేప



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ ఇన్‌చార్జి డీఎస్పీ లక్ష్మీకాంత్‌రెడ్డి

నిజామాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ నగర పాలక సంస్థలో బుధవారం ఏసీబీ అధికారుల తనిఖీలు ఆ శాఖలో కలకలం రేపాయి. గత ఏడాది ఆగస్టు లో నిజామాబాద్ నగర పాలక సంస్థలో తిష్టవేసి అనేక అక్రమా లకు పాల్పడ్డ ఆర్‌ఐ నరేందర్ ఏసీబీకి పట్టుబడటం చర్చనీ యాంశం కాగా, బుధవారం రెవెన్యూ విభాగంలో ఇన్‌చార్జి ఆర్‌ఐగా పనిచేస్తున్న శ్రీనివాసచారీ ఏసీబీకి పట్టుబడ్డాడు.

రెవెన్యూ విభాగం ఆదాయ వనరు..

నిజామాబాద్ నగర పాలక సంస్థలో ఇంటి నెంబర్లు, మ్యుటేషన్, ట్రేడ్ లైసెన్స్, పన్ను వసూళ్లు, ఇంటిపన్ను నిర్ధారణతో పాటు టౌన్‌ప్లానింగ్ విభాగం ద్వారా నూతన ఇంటి నిర్మాణాలకు అనుమతులు, ఇతరత్రా అనుమతులన్నీ కార్పొరేషన్ ద్వారానే ఇవ్వాలి. నిజామాబాద్ నగరానికి చెందిన ఏ పనైనా నగర పాలక సంస్థ ద్వారానే జరుగుతుండటంతో ఆ కార్యాలయంలో ఏ పనికావాలన్నా ముడుపులు చెల్లించాల్సిందే. ఇక్కడికి వచ్చే అధికారులు సైతం ఆ విధమైన ఆదాయం ఉంటుందనే నమ్మ కంతో పైరవీలు చేసి మరీ ఇక్కడికి పోస్టింగ్‌లు వేయించు కుంటున్నారు. ఏసీబీ అధికారులకు పట్టుబడుతున్న సిబ్బంది అధికారులు మాత్రం అవినీతిని వీడడం లేదు. నిజామాబాద్ నగర పాలక సంస్థ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారినట్లు అనేక ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు నిజాయితీగా ఉన్నప్పటికీ కిందిస్థాయి సిబ్బంది మాత్రం అవినీతికి అలవాటు పడి ఏ పని కావాలన్న డబ్బులు ఇస్తేనే పనులు చేస్తున్నారు. లేదంటే కార్యాలయాల చుట్టూ తిప్పుకొంటున్నారు. గతంలో నిజామాబాద్ మున్సిపాలి టీలో ఇన్‌చార్జి కమిషనర్‌గా పనిచేసిన నదీమ్ షైమద్ ఏసీబీకి పట్టుబడగా, 2018లో ఎంఈగా పనిచేసిన వెంకటేశ్వర్ రావు ఏసీబీకి పట్టుబడి అరెస్టు భయంతో ఆయన ఉంటున్న

మిగతా 8వ పేజీలో...

ఎరువుల కొరత లేకుండా చూసుకోవాలి..

- యాసంగిలోనూ ఎరువులు అందుబాటులో ఉంచాలి
- వ్యవసాయ అధికారులతో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు, 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ తరహాలోనే వచ్చే యాసంగి సీజన్‌కు సంబంధించి కూడా ఎరువుల కొరత తలెత్తకుండా రైతుల అవసరాలకు సరిపడా ఎరు వులు అందుబాటులో ఉండేలా ఇప్పటి నుంచే ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పడకల్ గ్రామంలో ఎరువుల గోదాంను కలెక్టర్ తనిఖీ చేశారు. గోదాంలో నిల్వ ఉన్న ఎరువులను పరిశీలించారు. ఖరీఫ్‌లో ఇంకా ఎంత మొత్తం యూరియా అవసరం పడుతుందని ఆరా తీశారు. స్టాక్ కొంత మిగిలి ఉండగానే ఇండెంటు పెట్టి కొత్త స్టాక్ తెప్పించుకోవాలని మండల వ్యవసాయాధికారి దేవికకు కలెక్టర్ సూచించారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిని కలెక్టర్ పంచాయతీ కార్యదర్శి రాకేష్‌ను అడిగి

మిగతా 8వ పేజీలో...



పడకల్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్



బాబోయ్.. 'కష్ట'మ్స్

- సుంకాలపై స్పష్టతలేక నిలిచిన పోస్టల్ సేవలు
- అమెరికాకు చేరని అత్యవసర పార్సిళ్లు
- అత్యవసర ఔషధాల కోసం ఎన్ఆర్ఐల ఎదురుచూపు
- జిల్లా పోస్టాఫీసుల్లో నిలిచిన యూఎస్‌ఏ బుకింగులు

బోధన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మన దేశంలో ఆగస్టు 25వ తేదీ నుంచి అమెరికాకు పలు రకాల పార్సిల్ సర్వీలసులు నిలిపివేశారు. అమెరికా ప్రభుత్వం విధించిన కొత్త కస్టమ్స్ నిబంధనల కారణంగా ఆ దేశానికి పలు పోస్టల్‌సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు భారత తపాలా శాఖ ప్రకటించింది. ఈ నిర్ణయంతో ఉత్తరాలు, కొన్ని బహుమతులు మినహా మిగిలిన అన్ని రకాల వస్తువుల బుకింగ్‌లు నిలిచిపోయాయి. దీంతో ఉమ్మడి జిల్లా నుంచి అమెరికా దేశానికి పోస్టల్ పార్సిల్ సేవలకు బ్రేక్ పడింది. పోస్టల్ పార్సిల్ నిలిపివేయడంతో అత్యవసర మందులు, (మెడిసిన్స్) వెళ్లకపోవడంతో అక్కడ భారతీయులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల నుంచి నిత్యం పోస్టాఫీసుల ద్వారా అమెరికా దేశాల్లో ఉన్న తల్లిదండ్రులకు వారి పిల్లలు. అక్కడ ఉద్యోగాలు చేస్తున్న భారతీయుల పిల్లలకు వారి తల్లిదండ్రులు వారికి కావాల్సిన నిత్యవ సర సరుకులు ఇక్కడి

మిగతా 8వ పేజీలో...

పోస్టాఫీసుకు తగ్గిన ఆదాయం..

: జాదవ్ ప్రకాష్, బోధన్ పోస్టల్ ఇన్ స్పెక్టర్



బోధన్ పోస్టాఫీసుల ద్వారా నిత్యం పార్సల్స్ పండగల వేలా అత్యధికంగా పార్సల్స్ అమెరికా దేశాలకు వెళ్లేవి. వీటికి బరువును బట్టి ధరను నిర్ణయిస్తారు. దీనివల్ల పోస్టాఫీసుకు ఆదాయం సమకూరేది. కాని పార్సల్స్ ఉన్నతాధికారుల మేరకు నిలిపివేయడంతో రావాల్సిన ఆదాయం తగ్గింది.

పంట నష్టం వివరాలను పక్కాగా సేకరించాలి

- ఒక్క ఎకరం కూడా తప్పిపోవద్దు
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి 8

వరద బాధితులను ఆదుకుంటాం..

- నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తాం
- రోడ్ల మరమ్మతులకు రూ.1.50 కోట్లు 8
- ఆస్తుల కోసమే కవిత సస్పెన్షన్
- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి

హరీశ్ రావు నిప్పులాంటి మనిషి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

నిజామాబాద్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి: కేసీఆర్ నాయకత్వంలో... అది ఉద్యమం అయినా,పాలన అయినా ఏ నాడైనా ప్రజల క్షేమం కోసం, పార్టీ కోసం, తెలంగాణ రాష్ట్రం కోసం నిర్విరామంగా కృషి చేస్తున్న వ్యక్తి హరీశ్ రావు అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కవిత వ్యాఖ్యలపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి స్పందించారు. కేసీఆర్ వెన్నంటే ఉంటూ 25 సంవత్సరాలుగా నిస్వార్థంగా పార్టీ కోసం కృషి చేస్తున్న వ్యక్తి జోగినిపల్లి సంతోష్‌కుమార్ అని, అలాంటి వారి వ్యక్తిత్వం మీద కమిట్మెంట్ మీద విమర్శలు చేయడం బాధాకరమని అన్నారు.

రోడ్లు ధ్వంసం.. ప్రయాణం నరకప్రాయం

- భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులు 6
- మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న ప్రజలు

రెండు డీజే సౌండ్ సిస్టంల సీజ్

- డీజే యజమానులపై రెండు కేసుల నమోదు
- రూ.3లక్షల పూచికత్తుతో బైండోవర్
- గణేష్‌ల వద్ద డీజేలు వద్దు : పోలీసులు

రోడ్లు ధ్వంసం.. ప్రయాణం నరకప్రాయం



రుద్రూర్ నుంచి అంబం(ఆర్) వెళ్లే రహదారి



వరదలకు కొట్టుకుపోయిన రోడ్డు

- భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు
- మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న ప్రజలు

రుద్రూరు,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రుద్రూర్ మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు ధ్వంసమయ్యాయి. రోడ్లన్ని కోతకు గురవ్వడంతో రహదారిపై రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు కోతకు గురైన రోడ్లతో పడరాని పాట్లు పడుతున్నారు. గతంలోనే ధ్వంసమైన రోడ్లకు తోడు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రోడ్ల మరమ్మత్తులకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయి. అధికారుల నిర్లక్ష్యం రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు, ప్రయాణికుల పాలిట శాపంగా మారుతుంది. రోడ్లకు మరమ్మత్తులు చేయకపోవడంతో రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారుతుందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల బాగుకు చర్యలు చేపడితే ప్రయాణం సాఫీగా సాగుతుందని వాహనదారుల నుంచి అభిప్రాయం వ్యక్తమవుతుంది.

● అధ్వానంగా మారిన రోడ్లు

రుద్రూర్ మండలంలోని పలు గ్రామాల రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. రుద్రూర్ నుండి అంబం(ఆర్) గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ప్రయాణికులు ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు జంకుతున్నారు. దీంతో పాటు రుద్రూర్ నుండి బొప్పాపూర్ వెళ్లే రోడ్డు సైతం మరీ అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరద ఉధృతికి రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రోడ్లు ధ్వంసం కావడంతో ఈ రోడ్లపై రాకపోకలు సాగించే బస్సులు, ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై రెండు బస్సులు సైతం ఒకేసారి ప్రయాణం సాగించే పరిస్థితి లేకుండా రోడ్ల పరిస్థితి మారింది. రోడ్ల మరమ్మత్తులకు చర్యలు చేపపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

● వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరదల ధాటికి రోడ్లు ధ్వంసమయ్యాయి. మండల కేంద్రానికి అనుసంధానంగా ఉన్న గ్రామాలకు వెళ్లే రోడ్లు ధ్వంసమయ్యాయి.రోడ్ల పరిస్థితి అధ్వానంగామారడంతో ప్రయాణికులు ప్రతి రోజు ప్రయాణం చేయడానికి అవస్థలు పడుతున్నారు.రోడ్లుకోతకు గురి కావడంతో పాటు గుంతలమయంగా మారడంతో ప్రయాణం చేయడానికి ప్రయాణికులు భయపడుతున్నారు.రోడ్ల మరమ్మత్తులకు ఆర్ అండ్ బీ అధికారులు సైతం చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటి వరకు అధికారులు ధ్వంసమైన రోడ్లను పరిశీలించకపోవడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రోడ్లకు తక్షణమే మరమ్మత్తులు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టాలి

రుద్రూర్ నుండి అంబం(ఆర్) రోడ్డుపై ప్రయాణం చేయడం ఇబ్బందికరంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరదల వల్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రోడ్లు కోతకు గురి కావడంతో పాటు గుంతలమయంగా మారాయి. రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- జక్రీ నరేందర్, అంబం(ఆర్)

రెండు డీజే సౌండ్ సిస్టంల సీజ్

- డీజే యాజమానులపై రెండు కేసుల నమోదు
- రూ.3లక్షల బైండోవర్ పూచికత్తు జప్తు



డీజే సౌండ్ సిస్టంలను సీజ్ చేసిన పోలీసులు

నవీపేట,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిజాంపూర్‌లోమంగళవారం రాత్రినిబంధనలకు విరుద్ధంగాపెట్టిన రెండు డీజేసౌండ్ సిస్టంలను సీజ్‌చేయడంతో పాటు సంబంధిత యాజమానులపై రెండు కేసులు నమోదు చేసినట్లు నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని మట్టయ్య ఫారంకు చెందిన ధారవత్ రమేష్‌ను 15రోజుల క్రితం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయడం జరిగిందని అన్నారు. బైండోవర్ నిబంధనను అతిక్రమించి తిరిగి మంగళవారం రాత్రి నిజాంపూర్‌లో డీజే సౌండ్ సిస్టం పెట్టిన రమేష్‌తో పాటు వాహన యాజమాని గంగాధర్‌లపై ఒక కేసు నమోదు చేయగా నందిపేట మండలం షాపూర్‌కు చెందిన పుల్లఅరవింద్ అనే డీజేయాజమానిపై మరో కేసు నమోదు చేయడం జరిగిందని సీఐ పేర్కొన్నారు. ధారవత్ రమేష్ బైండోవర్ నిబంధనను ఉల్లంఘించినందున అతనికి చెందిన 3లక్షల రూపాయల నగదు పూచికత్తును బుధవారంతహసీల్దార్ వెంకటరమణజప్తు చేసినట్లు ఆదేశాలు జారీ చేశారని సీఐ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపతి ఉన్నారు.

రెంజల్,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో మంగళవారం నిబంధనలు ఉల్లంఘించి గణేష్ మండపాల వద్ద డీజేలను పెట్టడంతో మూడు డీజేలను సీజ్ చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. గణేష్‌ల వద్ద డీజేలను పెట్టరాదని ముందస్తు సమాచారం అందించిన కూడా నిబంధనలు ఉల్లంఘించి గణేష్ నిమజ్జన కార్యక్రమాల్లో డీజేలను పెట్టిన మూడు డీజేలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగిందని అన్నారు. పోలీసుల సూచనలు ఎవరైన ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవబడతాయన్నారు. 9, 11వ రోజు నిమజ్జనోత్సవ కార్యక్రమంలో ఎవరు కూడా డీజేలను పెట్టకూడదని అన్నారు.

విజేత ఉపాధ్యాయులకు బహుమతుల ప్రదానం



చౌట్‌పల్లిలో ..

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 3: (ఆంధ్రజ్యోతి) మండలంలోని చౌట్‌పల్లిఉన్నతపాఠశాలోబుధవారం మండలస్థాయి బోధనా భ్యాస పరికరాల మేళానిర్వహించారు.మండలఎంపీడీవోరాజా శ్రీనివాస్, తహసీల్దార్ జి ప్రసాద్, ఎస్సై అనీల్‌రెడ్డి,మండల విద్యాధికారి ఆంధ్రయ్య బోధనభ్యాస పరికరాలమేళాను ప్రారం భించారు. ఈసందర్భంగా మండలంలోని ప్రాథమిక ప్రాథమీకోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థు లను అకట్టుకునే విధంగా బోధనపరికరాలను (టిఎల్ఎం)తయారుచేసి మేళాలో ప్రదర్శించారు. గెజిటెడ్ హెచ్ఎం రాంప్రసాద్, రాజన్న,మండలరిసోర్స్ పర్సన్స్‌చంద్రశేఖర్, రవిందర్,వేణు,అశోక్, ప్రసాద్, సంతోష్, శంకర్‌గౌడ్, మారుతి పరిశీలలించిమండలస్థాయిలో నాగమణి,అంజద్‌సుల్తాన్, సుజాత,శ్యామల,మంజూల,గంగామణి,మహేష్, కావ్య, రంజీత్,మారుతిలను ఉత్తమఉపాధ్యాయులుగా ఎంపికచేసి ప్రశంశపత్రాలతో పాటు మెమోంటోలు అందజేశారు.

సాలూర ఎత్తిపోతలకు పూర్వ వైభవం



మాట్లాడుతున్న ఎత్తిపోతల వద్ద కమిటీ సభ్యులు

సాలూర,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): సాలూర ఎత్తిపోతలకు పూర్వ వైభవం రానుందని కమిటీ అధ్యక్షులు శివకాంత్ పటేల్ అన్నారు. బుధవారం ఎత్తిపోతల పథకం వద్ద ఇరిగేషన్ మరియు ఐడీసీ అధికారులు కమిటీ మరియు రైతులతో సమావేశమయ్యారు. ఎత్తిపోతలలో అనేక సార్లు దొంగతనాలు చోటు చేసుకున్న విషయం అందరికి తెలిసిందే. విలువైన సామాగ్రి దొంగిలించబడడంతో గత ఏడు నెలల నుంచి ఎత్తిపోతల ద్వారా సాగునీరుకు శివారు ప్రాంత రైతులు దూరమయ్యారు. ఎత్తిపోతల పథకం ప్రారంభించే దశలో చర్యలు జరిగాయి. ఎత్తిపోతల పథకంలోని సామాగ్రి మరమ్మత్తులపై కమిటీ, రైతులు తీర్మానాలు చేసి సమర్పించినట్లయితే మరమ్మత్తుల కొరకు నివేదికలను ప్రభుత్వానికి సమర్పించి పూర్వ వైభవం తీసుకురావడానికి సాయశక్తులకు కృషి చేస్తామని అధికారులు కమిటీ మరియు రైతులకు భరోసా ఇచ్చారు. దీంతో సాలూర మండల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సాలూర పీఏసీఎస్ ఛైర్మన్ అల్లె జనార్ధన్, అల్లె రమేష్, డిస్కో సాయిలు, మైదాపు నాగరాజు, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్, ఐడీసీ ఏఈ గజానంద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

నవీపేట,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీ షీటర్లకు బుధవారం నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ తిరుపతిలు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ మేరకు వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. గణేష్ నిమజ్జన వేడుకల సందర్భంగా ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని వారిని హెచ్చరించారు. రౌడీ షీటర్లు తమ ప్రవర్తనను మార్చుకుని సత్ప్రవర్తన కలిగి ఉండాలని వారు సూచించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ముప్కాల్,సెప్టెంబరు,3(ఆంధ్రజ్యోతి):బాల్కొండమండలంలోని మున్నూర్ కాపు సంఘం వద్ద పేకాట ఆడుతున్న ఇద్దరి వ్యక్తులను పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై శైలేందర్ తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి తనిఖీలో భాగంగా బాల్కొండ మున్నూర్‌కాపు సంఘం వద్ద పేకాట ఆడుతున్న వారిని పట్టుకుని రూ. 4710 నగదు, రెండు సెల్‌ఫోన్లు, ఒక బండి, ఒక ఆటో పట్టుకుని సంబంధించిన సంఘటనపై వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కిసాన్‌నగర్‌లో: కిసాన్‌నగర్ దుబ్బలో గల బేదర్ సంఘంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకుని వారి వద్దనుంచి రూ. 3800లు, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శైలేందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గేదెలకు గాయాలు

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని తిమ్మారెడ్డి, కళ్యాణి గ్రామాల సరిహద్దు రామలింగబాయి గేటు వద్ద ఎల్లారెడ్డి- బాన్సువాడ ప్రధాన రహదారిపై బుధవారం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రెండుగేదేలు గాయాల పాలయ్యాయి. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం తెల్లవారుజామున రోడ్డు దాటుతున్న ఈ రెండు గేదేలను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఉండవచ్చునని తెలిపారు. ఈ గేదేలు ఏగ్రామానికి చెందినవి, వాటి యాజమాని ఎవరు తెలియాల్సి ఉంది.

హత్యకేసు నిందితునికి జీవితఖైదు

కామారెడ్డిటౌన్,సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):హత్యకేసులో నిందితునికి జీవితఖైదుతో పాటు రూ.2 వేల జరిమానాను న్యాయాధికారి విధించినట్లు ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు.డొంగ్లి మండలం మోగ గ్రామానికి చెందిన బరిగే లక్ష్మన్‌గొండ 2024 జూలై 20న రుణమాఫీ పనినిమిత్తం మేనూరు బ్యాంకుకు వెళ్లి సలాబాత్‌పూర్ శివారులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద బస్సు కోసం వేచిచూస్తున్నాడు. సలబాత్‌పూర్‌కు చెందిన ర్యావన్వారి సాయిలు అనేవ్యక్తి జూలాయిగా తిరుగుతూ గతంలో పలు నేరాలకు పాల్పడ్డాడని తెలిపారు. లక్ష్మన్‌గొండ వద్ద డబ్బు ఉన్న విషయాన్ని గమనించి అవిదోచుకునేందుకు ప్రయత్నం చేయగా సాయిలును అడ్డుకునే ప్రయత్నంచేశాడు.దీంతో ఎన్‌హెచ్-161 జాతీయరహదారి పక్కకు తీసుకెళ్లి దాడిచేసి గొంతునొక్కి లక్ష్మన్‌గొండను సాయిలు హత్యచేశాడని తెలిపారు. లక్ష్మన్‌గొండ ఇంకా ఇంటికి రాకపోవడంతో అతని కూమారుడు బరిగే అశోక్‌కు తండ్రికోసం చుట్టుపక్కల వెతుకుతుండగా సలబాత్‌పూర్ శివారులో ఒక వ్యక్తి మృతదేహం ఉందని సమాచారం రావడంతో వెళ్లి పరిశిలించాడు. తన తండ్రి లక్ష్మన్‌గోండ మృతదేహామని గుర్తించి శరీరంపై దెబ్బలు ఉండడంలో మద్నూర్ పోలీసులకు ఫీర్యాదు చేశాడు.ఈ విషయంలో కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేసిన మద్నూర్ పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి వరప్రసాద్ జీవితఖైదు,రూ.2 వేల జరిమానా వేశారని తెలిపారు.

గణేష్ నిమజ్జన స్థల పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఆర్మూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల నిమజ్జనం చేసే ప్రదేశాల్లో అన్ని వసతులు కల్పించి ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం పూర్తయ్యేలా చూడాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అబిగ్యాన్ మాల్వియా అన్నారు. బుధవారం ఆర్మూర్ పట్టణంలోని గూండ్ల చెరువుతో పాటు పెర్కి ట్, కొటార్మూర్, మామిడిపల్లిలోని చెరువులను సబ్ కలెక్టర్, ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ రాజు, తహసీల్దార్ సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. గణనాథుల శోభయాత్ర వెళ్లే దారిలో రోడ్లు గుంతలు లే కుండా మోరం వేయాలని దారిపొడవున లైటింగ్ ఏర్పాటు చేయాలని సూ చించారు. నిమజ్జనం సమయంలో అధిక సంఖ్యలో భక్తులు వస్తారని వారికి తాగడానికి మినరల్ వాటర్ సమకూర్చాలని అదే విధంగా వైద్య సేవలు ఏర్పాటు చేయాలని, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని సబ్ కలెక్టర్ అబిగ్యాన్‌మాల్వియాసూచించారు.ఆయనవెంటఅధికారులు ఉన్నారు.

ముప్కాల్, సెప్టెంబరు, 3(ఆంధ్రజ్యోతి): శుక్రవారం నిర్వహించే గణపతుల నిమజ్జనం ఏర్పాట్లను బాల్కొండ తహసీల్దార్ అధికారులతో కలిసి బుధవారం సర్వే చేశారు. బాల్కొండ మండల కేంద్రంలోని చెరువు వరకు గల రహదారిని, చేయ వల్సిన ఏర్పాట్లను పంచాయతీ సెక్రటరీకి, ట్రాన్స్‌కో సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో ఎంపీడీవో విజయ్ భాస్కర్‌రెడ్డి, ఎస్సై శైలేందర్, ఎంపీవో గంగమోహన్, విద్యుత్ ఏఈ కిషన్, జూనియర్ అసిస్టెంట్ ప్రభాకర్, పంచాయితీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, తదితరులున్నారు.

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని రాగుల కుంట వద్ద గణపతుల నిమజ్జన ప్రదేశాన్ని తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్, మున్సి పల్ కమిషన్ గోపు గంగాధర్, సీఐ సత్యనారాయణ గౌడ్ బుధవారం పరిశీ లించారు. ఈ సందర్భంగా నిమజ్జన ప్రదేశంలో ఏర్పాటు చేసిన సౌకర్యా లను గురించి మున్సిపల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిమజ్జనానికి వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూసుకోవాలని అలాగే త్రాగ డానికి మంచినీరు కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జనం చేసేట ప్పుడు ప్రజలు చెరువులోకి దిగకూడదని గజ ఈతగాళ్ల సహాయం తీసుకో వాలని తెలియజేశారు. వీరి వెంట ఎస్సై సందీప్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న దృశ్యం

బోధన్,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రాంతానికి చెందిన నర్సమ్మ అనే మహిళకు బుధవారం 33వేల రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ దాము మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నప్పటికీ పేదల సంక్షేమం కోసం సీఎంఆర్‌ఎఫ్ బిల్లులు అందజేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తలారి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం



వడ్యాట్‌లో క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

మోర్తాడ్,సెప్టెంబరు, 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్యాట్ గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారులు సీఎం రేవంత్‌రెడ్డి, మహేష్‌కు మార్ గౌడ్, సీతక్క,ముత్యాల సునీల్‌కుమార్ ల చిత్రపటానికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాలాభిషేకం చేశారు.గ్రామంలో 24 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు కాగా మొదటి విడతగా 8 మంది లబ్ధిదారులకు లక్షరూపాయల చొప్పున ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాలో జమ చేసిందని ఈ సందర్భంగా సంతోషంతో మహిళా లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో మం డల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, ఆనంద్, ఏఎంసీ డైరెక్టర్ మహిపాల్, నవీద్, స్థానిక నాయకులు నవీన్, సదానంద్ గౌడ్, పెండెం శ్రీనివాస్, సంతోష్, రవి, ఎర్రం శ్రీని వాస్, మనోజ్ పాల్గొన్నారు.

చిల్డ్రన్ యూత్ ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌ఎస్ గణేశుడు



ఆర్‌ఎస్‌ఎస్ యూనిఫాంలో గణేశుడు

పెర్కిట్,సెప్టెంబరు,3(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ పట్టణం లోని పెద్దబజార్ చిల్డ్రన్ యూత్ ఆ. ధ్వర్యంలో ఆర్‌ఎస్ ఎస్ వేషధారణ లో గణేషుడిని ఏర్పాటు చేశారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 100సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చిన్నారులు ముం దుగానే ఆర్‌ఎస్‌ఎస్ యూనిఫామ్ ధరించి కాషా య జెండాను పట్టుకున్న గణే షుని తయారు చేయించుకుని మండపంలో ప్ర త్యేక పూజలు నిర్వహించారు. గత ఐదు సంవ త్సరాలుగా చిన్నా రులు వినాయక చవితి ఉత్సవా లను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భం గా చిన్నారులను పలువు రు అభినందించారు.

ప్రశ్నకు కేంద్ర బిందువు ఉపాధ్యాయులే

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు, 3(ఆంధ్రజ్యోతి): మనిషిలోని ఆలోచనల ప్రతిబింబమే ప్రశ్నించడమనిఅట్టి ప్రశ్నించే తత్వం విద్యద్వారమే సాధ్యమని, విద్యను అందించే కర్మగారాలు పాఠశాలలేనని ఇందులో పనిచేసే ఉపాధ్యా యులు ప్రశ్నకు కేంద్ర బింద వులని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాంతన్ అన్నారు. సభ్యత్వ నమో దు కార్యక్రమంలో బుధవారం మండలంలోని వివిధ పాఠశాలలను పర్యటించి ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో టి. సాంతన్ మాట్లాడుతూ విద్యకున్న ప్రాధన్య తను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించడం లేద న్నారు. దేశానికి స్వాతంత్రం సిద్ధించి 78 ఏళ్లు గడిచిన కూడా విద్యారంగ లక్ష్యాలు నెరవేరడం లేదని నేటికి దేశ అక్షరాస్యత 65 శాతం మించ డం లేద న్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. పెండింగ్ బిల్లు లను ఇప్పిం చాలన్నారు.ఉపాధ్యాయేతర ఉద్యో గులకు సంబంధి ంచి సమస్యల పరిష్కరానికి ప్రభు త్వం సానుకులంగా స్పందించినప్పటికిని అనేక సమ స్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్ర మంలో డీపీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బా లయ్య, మండల అధ్యక్షుడు అప్పిరెడ్డి, జిల్లా కమిటీ సభ్య లు, డీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొ న్నారు.

అంగన్‌వాడి టీచర్ ఆత్మహత్య

మోపాల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాల్కల్ గ్రామానికి చెందిన బిల్లర్గా చిన్ను (39) బుధవారం సాయంత్రం మాసాని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామ స్తులు చర్చించుకుంటున్నారు. చిన్ను గత కొంత కాలం నుంచి నిజామాబాద్ నగరంలో నివాసం ఉంటుంది ఆమె ప్రస్తుతం కంఠేశ్వర్ ప్రాంతం లో అంగన్వాడి టీచర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఈమెకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. మోపాల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు ఈ సంఘటన పూర్తి వివరాలు తెలియ రావలసి ఉంది.

మోతెలో కొత్త రేషన్ కార్డుల అందజేత

వేల్పూర్,సెప్టెంబరు,3(ఆంధ్రజ్యోతి):వేల్పూర్ మండలం మోతె గ్రామంలో కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను బుధవారం లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఆవేదనకు గురయ్యారన్నారు.ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు భగ వాన్ దాస్, సురేష్, రాజేందర్, రవికాంత్, గంగా ధర్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

హత్య చేసిన నిందితునికి జీవిత ఖైదు

మద్నూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి):గత ఏడాది సలాబత్పూర్ శివారు లో ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద మోగ గ్రామానికి చెందిన లక్ష్మణ్ గోండ ను హత్య చేసిన నిందితుడు సాయిలును జిల్లా న్యాయాధికారి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ జీవిత ఖైదు విధించినట్లు మద్నూర్ ఎస్సై విజయ్ కొండ వెల్ల డించారు. పరిశోధనలో భాగంగా సాంకేతిక పరిజ్ఞానం సిసి పుటేజీ ఉప యోగించి కేసును ఛేదించిన బిచ్కుంద సీఐ నరేష్, ప్రస్తుత సీఐ రవి కు మార్, మద్నూర్ ఎస్సై విజయ్ కొండ, కోర్టు లైజెనింగ్ అధికారి ఎస్సై రాజ య్య,ఏఎస్సై రామేశ్వర్‌రెడ్డి, సీడీవో శ్రీకాంత్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.

ఎండు గంజాయి పట్టివేత

భీమ్‌గల్,సెప్టెంబరు, 3(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలో ఎండు గంజా యిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వేణు మాధవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ప్రభుత్వ డిగ్రీకళాశాల వెలుపల అనుమానాస్పద ప్రదేశాలలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఎండు గంజాయి విక్రయిస్తున్న కారేపల్లిగ్రామానికి చెందిన భూక్య రఘును అరెస్టు చేసి అతని వద్ద నుండి 128 గ్రాముల ఎండు గంజాయి, మొబైల్ ఫోన్ ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ముగ్గురు మైనర్ పిల్లలకు వారి తల్లిదండ్రుల ముందు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై గోవర్ధన్, సిబ్బంది దత్తాత్రి మహేష్ లు ఉన్నారు.

కేజీబీవీలో సమస్యలు పరిష్కరించాలని వినతి

ముప్కాల్,సెప్టెంబరు,3(ఆంధ్రజ్యోతి):ముప్కాల్ మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకు లు బుధవారం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. మురికి నీరు బయటకు వెళ్లడానికి డ్రైనేజీ నిర్మించాలని, కేజీబీవీకివెళ్లే దారిలో సీసీ రోడ్డు వేయించాలని, అసంపూర్తిగా ఉన్న ప నులను వెంటనే పూర్తి చేయించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షు డు బద్దం సంతోష్,నర్సయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బెంచీల వితరణ

కోటగిరి,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని కారేగాం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ముమ్మలనేని రాజశేఖర్ తనవంతు సహాయంగా బెంచీలను అందజేశారు. పాఠశాలలో ప్రతి విద్యార్థి కింద కూర్చుని చదువుకునే సమస్య లేకుండా బెంచీలను అందజేశారు.

ఆర్మూర్‌లో గణపతుల వద్ద హోమం, అన్నదానం

ఆర్మూర్ టౌన్, సెప్టెంబరు, 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ కార్యాల యంలోని గణపతి వద్ద హోమం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే పట్టణంలోని గోల్‌బంగ్ల వద్ద హిందూ వాహిని గణేష్ వినాయకుని వద్ద హోమం, అన్నదానం నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

మోర్తాడ్, సెప్టెంబరు, 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రా ములు అన్నారు. బుధవారం మండలంలోని గాండ్ల పేట్ గ్రామంలో నూతన గ్రామ పంచాయితీ భవ నానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క రూ. 20 లక్షల నిధులు మం జూరు చేశారని ముత్యాల రాములు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ఆనంద్, అనిల్, ఏఎంసీ డైరెక్టర్లు మహిపాల్‌రెడ్డి, నవీద్,మనోజ్, సాయిరాం, నర్సారెడ్డి, అరుణ్, తీగెల నర్సారెడ్డి, మల్లికార్జున్, సంజీవ్, రాజేంద్ర ప్రసాద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గణపతి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదు

నెట్‌వర్క్: గణపతి నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా పరిమితికిమించి డీజేలకు అనుమతి లేదని ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి బుధవారం సూచించారు. బోధన్ పట్టణంలో 4, 6వ తేదిలలో జరగనున్న వినాయక నిమజ్జన వేడుకల్లో డీజే సిస్టం నిషేధించామని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. గణేష్ శోభయాత్రలను శాంతియుతంగా జరుపుకోవాలని డీజేలకు అనుమతి లేదని మెండోర ఎస్సై సుహాసిని, డొంకేశ్వర్ ఎస్సై శ్యామ్ రాజ్, మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ సూచించారు.

డీజేలు పెట్టబోమని యజమానుల స్పష్టం

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు, 3(ఆంధ్రజ్యోతి): గణనాథుల నిమజ్జన శోభా యాత్రలో తాము డీజేలు పెట్టబోవడం లేదని ఆర్మూర్‌లోని డీజేల దుకాణ యజమానులు బుధవారం పోలీస్‌లకు హామి ఇచ్చారు. ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన డీజే దుకాణాల యజ మానులు తాము ఈ సంవత్సరం శోభాయాత్రలో తమ డీజేలను ఎవరికి అద్దేకు ఇవ్వమని స్వచ్ఛందంగా నిర్ణ యం తీసుకుని, రాతపూర్వకంగా ఒప్పందపత్రాన్ని సీఐసత్యనారాయణకు అందజే శారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట

ముప్కాల్,సెప్టెంబరు, 3(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని ఇత్వార్‌పేట్ లో బుధవారం వ్యవసాయ క్షేత్రాల వద్ద రైతు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ కిషన్ రైతులకు విద్యుత్ పై భద్రత నియమాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో లైన్‌మేన్ సుందర్ రావు, లైన్ ఇన్‌స్పెక్టర్ నర్సయ్యనవీన్, యాదగిరి,రమేష్, రైతులు పాల్గొన్నారు.

న్యాయవాద రక్షణ చట్టం తీసుకురావాలి

ఆర్మూర్ టౌన్, సెప్టెంబరు, 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల ను రక్షించేందుకు గాను న్యాయవాద రక్షణ చట్టం తీసుకురావాలని ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జక్కుల శ్రీధర్, జెస్సు అనిల్, సీనియర్ న్యాయవాది లోక భూపతి రెడ్డి కోరారు. బుధవారం బార్ అసోసి యేషన్ భవన్‌లో న్యాయవాద జేఏసీ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయ వాదులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన

రుద్రూరు,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ కృష్ణ యాదవ సంఘంలో బుధవారం గణనాథుని మండపం వద్ద సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షులు దావూర్ సాయిలు, కోడే శంకర్, కర్రోలశంకర్, రవి తదితరులున్నారు.

ముంబైలోని లాల్‌బాగ్ గణేష్‌ని దర్శించుకున్న రాష్ట్ర రైతు కమీషన్ సభ్యుడు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి):ముంబైలోని ప్రముఖ వినాయక మండపం లాల్‌బాగ్ గణేష్‌ని తెలంగాణ రాష్ట్ర రైతు కమీషన్ సభ్యుడు గడుగు గంగాధర్ దర్శించుకున్నారు. బుధవారం లాల్‌బాగ్ గణేష్‌ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లాల్‌బాగ్ గణేష్ కమిటీ ఛైర్మన్ బాలసాహెబ్ గడుగు గంగాధర్‌ను సన్మానించి పుస్తకాన్ని ప్రధానం చేశారు. ఈ సందర్భంగా గడుగు గంగాధర్ మాట్లాడుతూ ప్రతి యేటా లాల్‌బాగ్ గణేష్‌ని దర్శించుకుంటానని తెలిపారు.

గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం ఇంటర్వ్యూలు

డిచ్‌పల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ సబ్జెక్టులు బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కొరకు ఈనెల 11వ తేదీన విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి తెలిపారు. సంబంధిత సబ్జెక్టులలో కనీసం 65 శాతం మార్కులతో పాటు రెండు సంవత్సరాల బోధన అనుభవం కలిగి ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్ అర్హతకు ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

వైభవంగా ప్రారంభమైన కళా ఉత్సవ్

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):జిల్లా విద్యాశాఖ నిజామాబాద్ ఆధ్వర్యంలో జిల్లా బాల్ భవన్‌లో బుధవారం కళా ఉత్సవ్ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికి తీసేందుకు జిల్లాస్థాయి కళా ఉత్సవ్ సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండు రోజులు సాగే ఈ పోటీలలో గ్రూప్ డాన్స్, సోలో డాన్స్, గ్రూప్ సాంగ్స్, సోలో సాంగ్, ఇన్‌స్ట్రుమెంటల్, స్కిట్, 2డి, 3డి డ్రాయింగ్ మొదలైన పోటీలు విద్యార్థులకు నిర్వహించనున్నామన్నారు. విద్యార్థులంతా ఈ కళా ఉత్సవంలో చైతన్యవంతంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. విద్యార్థులను సంసిద్ధులను చేసి తీసుకొచ్చిన ఉపాధ్యాయులను డీఈవో ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ బాలక్ష్షారావు, నిజాంబాద్ అర్బన్ ఎంఈఓ సాయి రెడ్డి, జూరీ కమిటీ మెంబర్లు లక్ష్మీనాథం, ఆర్.గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మన్‌దీప్ గోల్‌తో గట్టెక్కింది!

కొరియాతో భారత్ మ్యాచ్ డ్రా

ఆసియా కప్ హాకీ

రాజ్‌గిర్ (బిహార్): ఆట ముగిసేందుకు మరో ఎనిమిది నిమిషాలే ఉంది. స్కోరు చూస్తే భారత్ 1-2తో కొరియాతో సూపర్ ఫోర్ తొలి మ్యాచ్‌లో వెనుకంజలో ఉంది. దాంతో ఆసియా కప్ హాకీ టోర్నీలో ఆతిథ్య భారత్‌కు తొలి పరాజయం తప్పదేమో అనిపించింది. కానీ ఈ దశలో ఫార్వర్డ్ మన్‌దీప్ సింగ్ మాయ చేశాడు. లెఫ్ట్ ఫ్లాంక్ నుంచి హర్మన్‌ప్రీత్ అందించిన రివర్స్ పాస్‌ను సుఖ్‌జీత్ సింగ్..మన్‌దీప్ వైపు కొట్టాడు. బంతిని అందుకున్న మన్‌దీప్ నలుగురు కొరియా డిఫెండర్లను బోల్తాకొట్టిస్తూ గోల్‌పోస్ట్‌లోకి పంపాడు. అంతే.. స్కోరు 2-2తో సమం. భారత ఫ్యాన్స్‌లో ఆనందం. సూపర్-4లో భాగంగా కొరియాతో బుధవారం జరిగిన మ్యాచ్‌ను భారత్ డ్రా చేసింది. దాంతో టోర్నమెంట్‌లో అపజయమెరుగని రికార్డును ఆతిథ్య జట్టు కొనసాగించింది. ఎనిమిదో నిమిషంలోనే హార్దిక్ సింగ్ గోల్ చేసి భారత్‌ను ఆధిక్యంలో నిలిపాడు. యాంగ్ జిహాన్ (12) గోల్‌తో స్కోరు సమం చేసిన కొరియా..కొద్ది సేపటికే కిమ్ (14) సాధించిన గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లింది. డ్రా దరిమిలా రెండు జట్లు చెరో పాయింట్ దక్కించుకున్నాయి. మరో సూపర్ ఫోర్ పోరులో మలేసియా 2-0తో చైనాను చిత్తు చేసింది. ఇక గురువారం జరిగే సూపర్-4 రెండో మ్యాచ్‌లో మలేసియాను భారత్ ఢీకొంటుంది.


మన్‌దీప్ సింగ్

జోకో.. జోరు

యూఎస్ ఓపెన్


సబలెంక

సెమీస్‌కు నొవాక్, సబలెంక

న్యూయార్క్: 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్, మహిళల డిఫెండింగ్ చాంప్ అరియానా సబలెంక యూఎస్ ఓపెన్ సెమీస్‌కు దూసుకెళ్లారు. గతేడాది రన్నరప్, లోకల్ స్టార్ టేలర్ ఫ్రిట్జ్‌తో ముఖాముఖి పోరులో ఏడో సీడ్ జొకో తన రికార్డును 11-0తో మరింతగా మెరుగుపర్చుకొన్నాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో జొకో 6-3, 7-5, 3-6, 6-4తో నాలుగో సీడ్ ఫ్రిట్జ్‌పై సునాయాసంగా గెలిచాడు. ఈ క్రమంలో 53వసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్ చేరిన నొవాక్.. అమెరికా లెజెండ్ క్రిస్ ఎవర్ట్ 52సార్లు సెమీస్ చేరిన రికార్డును బద్దలుకొట్టాడు. సెమీస్‌లో అల్కారజ్‌తో జొకో అమీతుమీ తేల్చుకోనున్నాడు. తొలి సెట్‌లో నొవాక్ అలవోకగా నెగ్గినా.. రెండో సెట్‌లో ఫ్రిట్జ్ నుంచి పోటీ ఎదురైంది. అయితే, 5-5 వద్ద తనదైన దూకుడు ప్రదర్శించిన నొవాక్ సెట్‌ను సొంతం చేసుకొని 2-0 ఆధిక్యంలోకి వెళ్లాడు. కానీ, మూడో సెట్‌లో ఫ్రిట్జ్ పోరాడి గెలిచినా.. ఆ తర్వాతి సెట్‌లో జొకో జోరు ముందు నిలవలేక పోయాడు. 2003లో చివరిసారి అమెరికా ఆటగాడు ఆండీ రాడిక్ న్యూయార్క్‌లో టైటిల్ నెగ్గాడు. ఈసారి ఫ్రిట్జ్ ఆ లోటు తీరుస్తాడనుకొంటే.. జొకో అడ్డుపడ్డాడు. కాగా, టాప్‌సీడ్ సబలెంకకు క్వార్టర్స్‌లో వాకోవర్ లభించింది. ప్రత్యర్థి మార్కెటా వొండ్రుసోవా (చెక్) ప్రాక్టీస్ చేస్తుండగా మోకాలికి గాయమైంది. దీంతో ఆమె బరిలోకి దిగలేక పోయింది. శుక్రవారం జరిగే సెమీస్‌లో గతేడాది ఫైనలిస్ట్ పెగులతో స బలెంక తలపడనుంది.

భాంబ్రి తొలిసారి..: యుకీ భాంబ్రి కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్‌కు చేరుకొన్నాడు. డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో భాంబ్రి-మైకేల్ వీనజ్ (న్యూజిలాండ్) జంట 6-4, 6-4తో జర్మనీకి చెందిన కెవిన్ క్రవీట్జ్-టిమ్ ప్యూట్జ్‌పై గెలిచింది.

నొవాక్ 'సోడా పాప్' సంబరాలు

మ్యాచ్ గెలిచిన తర్వాత జొకోవిచ్ 'కె-పాప్ డీమన్ హంటర్స్' సినిమాలోని 'సోడా పాప్' పాట డ్యాన్స్‌తో సంబరాలు చేసుకొన్నాడు. జొకో కుమార్తె తారకు 'కె-పాప్ డీమన్ హంటర్స్' అంటే ఎంతో ఇష్టం. కాగా, తార పుట్టిన రోజు కావడంతో.. ఆ డ్యాన్స్ మూమెంట్స్ ద్వారా కుమార్తెకు జొకో శుభాకాంక్షలు తెలిపాడు.

సినర్‌పై రూ. 2.64 కోట్ల పందెం

ఈ ఏడాది యూఎస్ ఓపెన్ టైటిల్‌ను డిఫెండింగ్ చాంప్ యానిక్ సినర్ నిలబెట్టుకొంటాడని కెనడా ర్యాపర్, సింగర్ డ్రేక్ భారీగా బెట్టింగ్ పెట్టాడు. ఇటలీ టాప్ సీడ్ ప్లేయర్‌పై డ్రేక్ రూ. 2.64 కోట్లు పందెం కాశాడు. ఒకవేళ సినర్ విజయం సాధిస్తే.. డ్రేక్‌కు రూ. 4.46 కోట్లు దక్కనున్నాయి.

నిఖత్‌పై అందరి దృష్టి!

నేటినుంచి ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్



లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రతిష్ఠాత్మక వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్ గురువారం ఇక్కడ ఆరంభం కానున్నాయి. ప్రపంచ బాక్సింగ్ కొత్త పాలక మండలి..'వరల్డ్ బాక్సింగ్' ఆధ్వర్యంలో తొలిసారి ఈ పోటీలు జరగనున్నాయి. ఈ చాంపియన్‌షిప్స్‌ను పురుషులు, మహిళల విభాగాలలో కలిపి ఒకేసారి నిర్వహిస్తుండడం విశేషం. ఇక..భారత్‌కు సంబంధించిన తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గొహైన్‌పై అందరి దృష్టి నిలిచింది. రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ వరుసగా మూడో వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో మూడు వేర్వేరు బరువు విభాగాలలో తలపడుతుండడం గమనార్హం. 2022లో 52కి. విభాగంలో విశ్వవిజేతగా నిలిచిన నిఖత్.. 2023లో 50కి. కేటగిరీలో టైటిల్ దక్కించుకుంది. ఇక ఈసారి 51 కి. విభాగంలో తలపడుతోంది. మారిన బరువు విభాగంలో నిఖత్ ఎలా రాణిస్తుందన్నది ఆసక్తికరం. పారిస్ ఒలింపిక్స్‌లో రెండో రౌండ్‌లోనే ఓటమి చవిచూసిన జరీన్.. ఏడాది తర్వాత అంతర్జాతీయ పోటీల బరిలో దిగుతోంది. పారిస్ క్రీడల తర్వాత నిఖత్‌తో పాటు లవ్లీనా ఒక దేశవాళీ ఈవెంట్‌లో మాత్రమే పాల్గొన్నారు. ఇద్దరికీ తొలి రౌండ్లలో కఠిన ప్రత్యర్థులు ఎదురు కానున్నారు. 65 దేశాల నుంచి 550మంది బాక్సర్లు ఈ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో తలపడుతున్నారు. భారత్ నుంచి పురుషుల, మహిళల విభాగాల్లో చెరి పదేసి మంది బాక్సర్లు పోటీపడుతున్నారు.

రోహిత్, గిల్ అండ్ కోకు 'బ్రాంకో టెస్ట్' లేనట్టే..



న్యూఢిల్లీ: భారత జట్టు ఆటగాళ్లకు బీసీసీఐ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ)లో ఫిట్‌నెస్ టెస్ట్‌లు నిర్వహిస్తూంటుంది.. ఇది రొటీన్‌గానే జరిగేదే అయినా.. సరికొత్తగా 'బ్రాంకో' టెస్ట్‌ను ప్రవేశపెడుతున్నారని కొద్ది రోజుల క్రితం వచ్చిన వార్త కారణంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. రగ్బీ ఆటగాళ్లకు నిర్వహించే ఈ కఠిన పరీక్షను రోహిత్ శర్మను బయటకు పంపేందుకే ప్రవేశపెడుతున్నారంటూ విమర్శలు కూడా వినవచ్చాయి. తాజా సీజన్ నేపథ్యంలో రోహిత్, శుబ్‌మన్ గిల్, బుమ్రా సహా మరికొందరు కాంట్రాక్ట్ ప్లేయర్లు సీవోఈలో ఫిట్‌నెస్ పరీక్షకు హాజరయ్యారు. అయితే, వీరెవరికీ బ్రాంకో టెస్ట్ నిర్వహించలేదని తెలుస్తోంది. ఈ నూతన టెస్ట్‌ను ఇంకా ఫిట్‌నెస్ పరీక్షల్లో భాగం చేయలేదట. అందుకే పాతపద్ధతిలో యో-యో టెస్ట్ ద్వారానే ఫిట్‌నెస్‌ను పరీక్షించిందట. పైగా బోర్డు కూడా బ్రాంకో టెస్ట్‌ను ప్రవేశపెడుతున్నట్టు అధికారికంగా కూడా ప్రకటించలేదు.

బెంగాల్‌పై పుణెరి గెలుపు



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్-12 తొలి అంచెలో భాగంగా బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 45-36 స్కోరుతో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. ఆట ప్రారంభం నుంచి పల్టన్ ఆటగాళ్లు దూకుడుగా ఆడి వారియర్స్‌పై ఒత్తిడి పెంచారు. ప్రథమార్థం 26-22 స్కోరుతో ముగిసింది. ద్వితీయార్థంలో పుంజుకునేందుకు యత్నించిన బెంగాల్ వారియర్స్‌ను పుణెరి డిఫెండర్లు నిలువరించారు. వారియర్స్ కెప్టెన్, స్టార్ రైడర్ దేవంక్ పలుమార్లు ప్రత్యర్థి డిఫెండర్లకు చిక్కడంతో మ్యాచ్‌పై పట్టు కోల్పోయారు. పుణెరి జట్టులో అస్లాం ఇనాందార్, ఆదిత్య షిండే చెరో 11 పాయింట్లు సాధించారు. హరియాణా స్టీలర్స్-యు ముంబా జట్ల మ్యాచ్ 36-36తో టైగా ముగిసింది. అయితే షూటౌట్‌లో హరియాణా విజయం సాధించింది.

శ్రీలంకదే తొలి టీ20

హరారే: జింబాబ్వేతో తొలి టీ20లో శ్రీలంక గెలుపొందింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 175/7 చేసింది. దుష్మంత చమీర 3 వికెట్లు తీశాడు. ఛేదనలో శ్రీలంక 19.1 ఓవర్లలో 177/6 స్కోరు చేసి గెలుపొందింది. నిస్సాంక (55), కమిందు మెండిస్ (41 నాటౌట్) రాణించారు.

కబడ్డీ విజేత జోగులాంబ లయన్స్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): యువ తెలంగాణ కబడ్డీ లీగ్ ట్రోఫీని జోగులాంబ లయన్స్ జట్టు కైవసం చేసుకుంది. బుధవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో లయన్స్ 35-21 స్కోరుతో భద్రాద్రి బ్రేవ్స్ జట్టుపై నెగ్గింది. లీగ్ ఉత్తమ రైడర్‌గా జి.రాజు, డిఫెండర్‌గా నవీన్, ఆల్‌రౌండర్‌గా లక్ష్మణ్‌కు ప్రత్యేక అవార్డులు లభించాయి. ఐపీఎస్ అధికారి రాహుల్ హెగ్డే, తెలంగాణ కబడ్డీ సంఘం అధ్యక్షుడు కాసాని వీరేష్, కార్యదర్శి మహేందర్ విజేతలకు ట్రోఫీ ప్రదానం చేశారు.

తిప్పేసిన నితిన్



చెన్నై: బుచ్చిబాబు ఆలిండియా క్రికెట్ టోర్నమెంట్ రెండో సెమీ ఫైనల్లో హరియాణాను 99 పరుగులతో ఓడించి హైదరాబాద్ జట్టు ఫైనల్‌లో ప్రవేశించింది. బుధవారం తమ రెండో ఇన్నింగ్స్‌లో హరియాణా 272 పరుగుల లక్ష్యంతో ఛేదన ప్రారంభించగా, హైదరాబాద్ లెఫ్టార్మ్ స్పిన్నర్ నితిన్ సాయి యాదవ్ (7/44) దెబ్బకు 62.4 ఓవర్లలో 181కు ఆలౌటై పరాజయం పాలైంది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 225, హరియాణా 208కు, రెండో ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 254కు ఆలౌటయ్యాయి. హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 91 పరుగులతో రాణించిన వరుణ్ గౌడ్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

ఇకపై మరింత బాధ్యతగా ఉంటాం

'చిన్నస్వామి' ఘటనపై కోహ్లీ



న్యూఢిల్లీ: బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో గత జూన్ నాలుగున జరిగిన తొక్కిసలాటపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ ఎట్టకేలకు స్పందించాడు. 'అది.. మా ఫ్రాంచైజీ చరిత్రలో ఓ సంతోషకరమైన ఘట్టం కావాల్సింది. కానీ విషాదంగా మారింది. ఆ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన మా అభిమానుల గురించి ఆలోచిస్తున్నా. వారి గురించి ప్రార్థిస్తున్నా. ఇకపై జాగ్రత్తగా, బాధ్యతగా, గౌరవంగా ముందుకు సాగుతాం' అని కోహ్లీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ సీజన్ ఐపీఎల్ టైటిల్‌ను ఆర్‌సీబీ గెలుచుకున్న సందర్భంగా చిన్నస్వామి స్టేడియంలో ఏర్పాటు చేసిన విజయోత్సవంలో తొక్కిసలాట జరిగి 11 మంది క్రికెట్ ఫ్యాన్స్ మరణించగా, మరో 71 మంది గాయపడ్డారు.

వృద్ధి, ఉద్యోగాల కల్పనకు ఊతం

బిజినెస్

జీఎస్‌టీ సంస్కరణలపై హర్షాతిరేకాలు



ప్రభుత్వం బుధవారం ప్రకటించిన జీఎస్‌టీ సంస్కరణలు ఆర్థిక వృద్ధికి, ఉపాధికల్పనకు ఊతం ఇచ్చేలా ఉన్నాయి. ఒక పక్క భౌగోళిక, రాజకీయ పరిస్థితుల ప్రభావంతో దేశీయ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సవాలును ఎదుర్కొంటోంది. మరోపక్క అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటు ఎగుమతుల రంగానికి తీరని కాటుగా పరిణమించింది. గత కొద్ది కాలంగా ఎగుమతుల రంగం భారీ తిరోగమనంలో ఉంది. సుంకాల ప్రభావం వల్ల రాబోయే కాలంలో ఎగుమతులు భారీగా పడిపోవచ్చునన్న భయాలు కూడా సర్వత్రా నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య దేశీయ వినియోగాన్ని గణనీయంగా పెంచుతుందని, తద్వారా ఎగుమతుల నష్టాన్ని భర్తీ చేస్తుందని విశ్లేషకులంటున్నారు. దీనికి తోడు దేశంలో పండుగల సీజన్ ప్రారంభమవుతోంది. ఈ సీజన్‌లో వస్తు సేవల వినియోగం పెరిగి ఆర్థిక వ్యవస్థ ఉత్తేజితం కావడానికి ఈ చర్య దోహదపడుతుందన్నది వారి అభిప్రాయం. దేశంలో జీఎస్‌టీ ప్రవేశపెట్టిన తర్వాత తొలి భారీ ప్రక్షాళన ఇదే. ఈ చర్యల ఫలితంగా ప్రభుత్వం పన్నుల రూపేణ ఆదాయాన్ని నష్ట పోయినా, దేశీయ వినియోగం భారీగా పెరిగి ఆర్థిక వ్యవస్థ సుంకాల పోటు నుంచి చాలా వరకు బయట పడుతుందని ఆర్థిక నిపుణుల అంచనా. దీంతో ఇప్పటి వరకు నీరసించిన ప్రైవేటు పెట్టుబడులు సైతం ఊపందుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదే జరిగితే జీడీపీ వృద్ధి రేటుకూ ఢోకా ఉండదని అంచనా. ఇప్పటివరకు ఉన్న శ్లాబ్‌లను రెండు శ్లాబ్‌లకు కుదించడం ద్వారా సగటు మనిషి వినియోగించే అనేక వస్తువులు 5 శ్లాబ్‌లోకి జారుకుని సగటు జీవికి ఉపశమనం కలుగుతుంది. దీన్ని దేవీ నవరాత్రులు, దీపావళి ముందు ప్రభుత్వం ప్రకటించిన బొనాంజాగా నిపుణులు, పరిశీలకులు అభివర్ణిస్తున్నారు. ఈ సంస్కరణలు సగటు జీవిపైనే కాకుండా రైతాంగం, చిన్న వ్యాపారులపై కూడా భారాన్ని గణనీయంగా తగ్గిస్తాయన్నది వారి అభిప్రాయం. ఇది సగటు జీవికి అసలైన పండుగ అని ప్రభుత్వాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

స్టాక్ మార్కెట్ పరుగే

జీఎస్‌టీ నిర్ణయం గురువారం స్టాక్‌మార్కెట్‌కు పెద్ద ఉత్తేజం కావచ్చునని మార్కెట్ నిపుణులంటున్నారు. ఇటీవల కాలంలో ఈక్విటీ, ఫారెక్స్ మార్కెట్లు భారీ ఆటుపోట్లు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో మార్కెట్ తాత్కాలికంగా ఊపిరి తీసుకోవడం ఖాయమని, గురువారం మార్కెట్ సానుకూలంగా స్పందించవచ్చునని పరిశీలకులన్నారు.

పురోగామి చర్య : ఎంట్రీ లెవల్ టూ వీలర్లు, కార్లపై విధించే జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతానికి కుదించడంపై ఆటోమొబైల్ పరిశ్రమ హర్షం వ్యక్తం చేసింది. 'జీఎస్‌టీ రేట్లను హేతుబద్ధం చేయాలని మేము ఎప్పటి నుంచో కోరుతున్నాం. ప్రభుత్వం ఎట్టకేలకు మా మొర ఆలకించింది' అని మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ని ఆయన సరైన సమయంలో తీసుకున్న పురోగామి చర్యగా అభివర్ణించారు.ఈ చర్య తప్పకుండా దేశంలో కార్ల డిమాండ్‌ను పెంచుతుందన్నారు. అన్ని రకాల ఆటోమొబైల్ విడి భాగాలను 28 శాతం జీఎస్‌టీ నుంచి 18 శాతం జీఎస్‌టీ శ్లాబులోకి మార్చడంపై ఆ కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే ఆటోమోటివ్ కంపోనెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఏసీఎంఏ) ప్రశంసించింది. ఎప్పటి నుంచో అడుగుతున్న తమ ఈ కోరికను ప్రభుత్వం ఇన్నాళ్లకు మన్నించిందని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ విన్నీ మెహతా తెలిపారు.

చిన్న కార్ల ధరలు ఎంత తగ్గొచ్చు..?

4మీటర్లలోపు వాహనాల విభాగంలో 1200 సీసీ వరకు పెట్రోల్ కార్లపై ప్రస్తుతం 28 శాతం జీఎస్‌టీతోపాటు ఒక శాతం సెస్సు కూడా చెల్లించాల్సి ఉంటుంది. 1500 సీసీ వరకు డీజిల్ కార్లపై కేంద్రం 28 శాతం జీఎస్‌టీతోపాటు 3 శాతం సెస్సు వసూలు చేస్తోంది. ఈ విభాగ కార్లను తాజాగా 18 శాతం శ్లాబులో చేర్చారు. దీంతో చిన్న, హ్యాచ్‌బ్యాక్ మోడళ్ల ధరలు 8-10 శాతం వరకు తగ్గవచ్చని అంచనా వేసింది. మారుతి సుజుకీ చిన్న కారు ఆల్టో కే10 ఎక్స్‌షోరూమ్ ధర రూ.4.23 లక్షల నుంచి రూ.3.89 లక్షలకు తగ్గే అవకాశం ఉంది. హ్యుండయ్ హ్యాచ్ బ్యాక్ మోడల్ గ్రాండ్ ఐ10 మోడల్ రేటు రూ.5.98 లక్షల నుంచి రూ.5.51 లక్షలకు దిగిరావచ్చు. రెనో క్విడ్ ఎక్స్ షోరూమ్ ధర కూడా రూ.40,000 వరకు తగ్గవచ్చని అంచనా.

ఎగుమతిదారుల హర్షం: ఇక నుంచి వారం రోజుల్లోనే జీఎస్‌టీ రిఫండ్స్ ప్రక్రియ పూర్తి కానుంది. ఇది ఎగుమతిదారుల నిధుల కొరత సమస్యనూ తీరుస్తుందని భారత ఎగుమతి సంఘాల సమాఖ్య (ఫియో) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1,000 వరకు ఉన్న జీఎస్‌టీ రిఫండ్‌లను అనుమతించడం ఇ-కామర్స్ ఎగుమతిదారులకు పెద్ద ఊరట అన్నారు.

ద్రవ్యోల్బణం కట్టడికి దోహదం: జీఎస్‌టీ రేట్ల తగ్గింపు వస్తు, సేవల వినియోగం భారీగా పెరగడంతోపాటు ద్రవ్యోల్బణం కట్టడి, ఆర్థిక వృద్ధి, ఉద్యోగాల కల్పనకూ ఊతమివ్వనుందని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి. మరింత సరళమైన, పారదర్శకమైన, సమగ్ర పన్ను వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు తాజా సంస్కరణలు దోహదపడనున్నాయని మహీంద్రా గ్రూప్ సీఈఓ, ఎండీ డాక్టర్ అనిశ్ షా అన్నారు.

రియల్టీ, మౌలిక రంగాలకు బూస్ట్ : సిమెంట్, స్టీల్‌పై జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతం తగ్గించడం రియల్ ఎస్టేట్, మౌలిక రంగాల నిర్మాణ వ్యయాలను గణనీయంగా తగ్గించనుందని నరెడ్కో జాతీయ అధ్యక్షుడు, హీరానందిని గ్రూప్ చైర్మన్ నిరంజన్ హీరానందిని అన్నారు. ముఖ్యంగా అందుబాటు గృహ ప్రాజెక్టులకు లబ్ధి చేకూరనుందని, నిర్మాణ వ్యయం తగ్గితే కొనుగోలుదారులకు ఈ గృహాలు మరింత తక్కువ ధరకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యానికి తోడ్పాటు: 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన చేర్చాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం జీడీపీ ఏటా 7 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేయాల్సిన అవసరం ఉంది. ట్రంప్ 50 శాతం సుంకాలతో ఎగుమతి ఆధారిత రంగాల వ్యాపారంపై ప్రభావం చూపనున్న తరుణంలో జీఎస్‌టీ రేట్ల తగ్గింపు దేశీయంగా వినియోగాన్ని పెంచి వృద్ధి రేటుకు అండగా నిలవనుందని హీరానందాని అన్నారు.

బంగారం @ రూ.1.07 లక్షలు

వరుసగా 8 రోజుల్లో రూ.6,900 అప్



పసిడి సరికొత్త జీవనకాల పతాక స్థాయికి ఎగబాకింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మరో రూ.1,000 పెరిగి రూ.1,07,070కి చేరింది. 99.5% స్వచ్ఛత గల బంగారం రేటు కూడా అదే స్థాయిలో ఎగబాకి రూ.1,06,200కి చేరుకుంది. కిలో వెండి మాత్రం ఎలాంటి మార్పు లేకుండా రూ.1,26,100 పలికింది. బంగారం ధరలు పెరగడం వరుసగా ఇది ఎనిమిదో రోజు. గడిచిన 8 రోజుల్లో తులం బంగారం రూ.6,900 పెరిగింది. అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ఈ నెలలో ప్రామాణిక వడ్డీరేట్లను మరో 0.25% తగ్గించవచ్చన్న అంచనాలతోపాటు అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య అనిశ్చితులు బంగారం, వెండి ధరలకు ఆజ్యం పోస్తున్నాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర రేటు తొలిసారిగా 3,600 డాలర్ల మైలురాయిని దాటింది. ఒకదశలో 3,622 డాలర్ల వద్ద ఆల్‌టైం ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. సిల్వర్ 41.35 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. అంతర్జాతీయంగా వీటి ధరలు మున్ముందు మరింత ఎగబాకవచ్చని బులియన్ నిపుణులు భావిస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4 తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	570
వరంగల్	537	గోదావరి	570
చిత్తూరు	578	విశాఖపట్నం	575


దజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	98	విజయవాడ	127
వరంగల్	98	గుంటూరు	115
కరీంనగర్	98	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	90
కర్నూలు	98	నెల్లూరు	95
విశాఖపట్నం	131	అనంతపురం	95
గోదావరి	127		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,06,970 ▲	98,050 ▲	1,37,000 ▲
విజయవాడ	1,09,000 ▲	1,03,000 ▲	1,26,700 ▲
విశాఖపట్నం	1,09,430 ▲	97,250 ▲	1,37,000 ▲
రాజమండ్రి	1,06,960 ▲	98,050 ▲	1,26,400 ▼
ప్రొద్దుటూరు	1,07,200 ▲	98,620 ▲	1,26,000 ▲
ముంబై	1,06,020 ▲	97,120 ▲	1,23,220 ▲

మారుతి కొత్త కారు విక్టోరిస్

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకీ ఇండియా తన స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్ (ఎస్‌యూవీ) పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించింది. ఈ విభాగంలో బ్రెజ్జా, ఫ్రాంక్స్, జిమ్నీ, గ్రాండ్ విటారా వంటి మోడళ్లను విక్రయిస్తున్న కంపెనీ.. విక్టోరిస్ పేరుతో మరో కాంపాక్ట్ ఎస్‌యూవీని బుధవారం ఆవిష్కరించింది. హ్యుండయ్ క్రెటా, కియా సెల్టోస్, హోండా ఎలివేట్, టయోటా హైరైడర్, టాటా కర్వ్, స్కోడా కుషాక్, ఫోక్స్‌వేగన్ టైగున్‌కు పోటీగా ఈ కారును మార్కెట్లోకి ప్రవేశపెడుతోంది. 1.5 లీటర్ పెట్రోల్, సీఎన్‌జీ, హైబ్రిడ్ ఇంజన్ ఆప్షన్లతో కూడిన ఈ కారును అరెనా షోరూమ్స్ ద్వారా విక్రయించనున్నట్లు కంపెనీ తెలిపింది. మొత్తం ఆరు వేరియంట్లు, పది రంగుల్లో లభించనున్న ఈ కారులో మారుతి పలు ఆధునిక ఫీచర్లను అందుబాటులోకి తెచ్చింది. రూ.11,000తో బుకింగ్ సౌకర్యాన్ని ప్రారంభించిన కంపెనీ.. కారు ధరను త్వరలోనే ప్రకటించనుంది. దీని ప్రారంభ ధర రూ.9.75 లక్షల స్థాయిలో ఉండవచ్చని అంచనా. భద్రతకు సంబంధించి ఈ కారుకు 5-స్టార్ భారత్ ఎన్‌క్యాప్ సేఫ్టీ రేటింగ్ లభించినట్లు సంస్థ తెలిపింది.

సెన్సెక్స్ 410 పాయింట్లు అప్

తొలుత తడబాటు.. ఆఖర్లో జోరు

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం ట్రేడింగ్‌లో మధ్యాహ్నం వరకు లాభనష్టాల మధ్య ఊగిసలాడినప్పటికీ, ఆఖరి గంటలో భారీగా పుంజుకున్నాయి. దాంతో సెన్సెక్స్ 409.83 పాయింట్ల వృద్ధితో 80,567.71 వద్ద, నిఫ్టీ 135.45 పాయింట్ల పెరుగుదలతో 24,715.05 వద్ద ముగిశాయి. జీఎస్‌టీ మండలి సమావేశంలో తీసుకోబోయే నిర్ణయాలపై ఆశాభావంతోపాటు మెటల్ షేర్లలో ర్యాలీ ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 21 రాణించాయి. టాటా స్టీల్ షేరు 5.90 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.90% శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.63% ఎగబాకాయి. రంగాలవారీ సూచీల్లో మెటల్ 3.08 శాతం పుంజుకోగా.. కమోడిటీస్, హెల్త్‌కేర్ ఒక శాతానికి పైగా పెరిగాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మరో రూ.1,666.46 కోట్ల నికర అమ్మకాలకు పాల్పడగా.. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు నికరంగా రూ.2,495.33 కోట్ల కొనుగోళ్లు జరిపారు. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ఆల్‌టైం కనిష్ఠ స్థాయి నుంచి కాస్త కోలుకుంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 9 పైసలు పెరిగి రూ.88.06 వద్ద ముగిసింది.

హైదరాబాద్-ఆమ్‌స్టర్‌డామ్ మధ్య డైరెక్ట్ విమాన సర్వీసు

కేఎల్‌ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నెదర్లాండ్ కేంద్రంగా పని చేసే కేఎల్‌ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ మన దేశంలో తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్ నుంచి నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డామ్‌కు డైరెక్ట్ విమాన సర్వీసులు ప్రారంభించింది. వారానికి మూడు రోజులు ఈ సర్వీసులు నడుస్తాయని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మార్టెన్ స్టీనెన్ చెప్పారు. బెంగళూరు, ఢిల్లీ, ముంబై తర్వాత భారత్‌లో హైదరాబాద్ తమకు నాలుగో ప్రవేశ ద్వారమని తెలిపారు. ప్రస్తుతం ఈ నాలుగు నగరాల నుంచి ఆమ్‌స్టర్‌డామ్ వారానికి 24 విమాన సర్వీసులు నడుపుతోంది. వింటర్ సీజన్‌లో ఈ సర్వీసులను 27కు పెంచనున్నట్టు మార్టెన్ స్టీనెన్ చెప్పారు. ఫార్మా, ఐటీ కంపెనీలకు కేంద్రంగా ఎదిగిన హైదరాబాద్ నుంచి సరుకు రవాణాకు అద్భుత అవకాశం ఉందన్నారు. బోయింగ్ 777-200ఈఆర్ విమానాలతో ప్రారంభించిన హైదరాబాద్-అమెస్టర్‌డ్యామ్ విమాన సర్వీసులో వివిధ తరగతుల్లో 288 మంది ప్రయాణించ వచ్చని కేఎల్‌ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ అధికారులు చెప్పారు.

హైదరాబాద్‌లో యునిస్పేస్ మెగాస్టోర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : నిర్మాణ, నిర్మాణ పరికరాల రంగంలోని అపర్ణా ఎంటర్‌ప్రైజెస్ (ఏఈఎల్) హైదరాబాద్‌లోని మియాపూర్‌లో యునిస్పేస్ మెగాస్టోర్‌ను ప్రారంభించింది. ఇది ఆసియాలోనే అతి పెద్ద స్టోర్ అని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విన్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. తమ రిటైల్ విస్తరణలో భాగంగా బెంగళూరు, ఢిల్లీ, ముంబై నగరాల్లో కూడా ఇదే తరహా స్టోర్లు ప్రారంభించాలనుకుంటున్నట్టు చెప్పారు. భవన నిర్మాణంలో ఉపయోగించే 20 రకాల వస్తువులకు ఇది వన్ స్టాప్ సొల్యూషన్‌గా ఉంటుందని కంపెనీ వైస్ ప్రెసిడెంట్ శ్రేయాస్ త్రివేది వెల్లడించారు. కస్టమర్లకు ఇంటి డిజైన్, నిర్మాణం, ఆధునీకరణ వంటి సేవలన్నీ ఒకే ఛత్రం కింద అందించాలన్నది తమ కాన్సెప్ట్ అని ఆయన చెప్పారు. ఇది కస్టమర్లకు సరికొత్త అనుభూతిని అందిస్తుందని ఆయన అన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

5న జీపీవోలకు నియామక పత్రాలు

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5 వ తేదీన హైదరాబాద్ లోని హైటెక్స్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గ్రామ పాలన అధికారుల(జీపీవో)కు నియామకపత్రాలు అందజేస్తారని, జీపీవోలుగా ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్‌కు వచ్చేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్ సూచించారు. జీపీవో అభ్యర్థులు హైదరాబాద్ వెళ్లడానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్ మాట్లాడుతూ, జీపీవోలుగా ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 5వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రుల చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్న దృష్ట్యా, అభ్యర్థులకు ముందస్తు సమాచారం అందించి హైదరాబాద్ సకాలంలో చేరుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా జిల్లాల నుంచి ప్రత్యేక బస్‌లలో వారిని నిర్ణీత సమయానికి తరలించాలని ఆదేశించారు. నియామకాలకు సంబంధించిన సమాచారాన్ని జిల్లాకు చెందిన మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యేలకు కూడా తెలియజేయాలన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. జిల్లా నుంచి 301 మంది జీపీవోలుగా ఎంపికయ్యారని, వీరిని శుక్రవారం హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులలో తరలించేందుకు ఏర్పాట్లు చేశామని అన్నారు. నిజామాబాద్ డివిజనల్‌కు చెందిన వారు జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానం నుంచి, ఆర్మూర్ డివిజన్ వారు ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయం నుంచి, బోధన్ డివిజన్‌కు చెందిన వారు బోధన్ తహసీల్దార్ కార్యాలయం నుంచి బయలుదేరి వెళ్తారని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్‌లు అంకిత్, కిరణ్ కుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రైతులను ఆదుకోవాలని సీఎంకు లేఖ

సుభాష్‌నగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పటేల్ బుధవారం బహిరంగ లేఖ రాశారు. కామారెడ్డితో పాటు నిజామాబాద్ జిల్లాలో పర్యటించి ప్రజలను, రైతులను ఆదుకోవాలని కోరారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ధర్పల్లి మండలంలో వాడి, నడిమితాండా, బీరప్ప తండా, సిరికొండ మండలంలోని కొండూర్, పెద్దవాల్గోట్, గడ్కోల్ గ్రామాల్లో భారీగా పంట నష్టంతో పాటు ఆస్తినష్టం జరిగిందని తెలిపారు. కొండూర్ గ్రామంలో 200 ఇండ్లు, వాడి గ్రామంలో 150 ఇండ్లు, గడ్కోల్‌లో 50, పెద్దవాల్గోట్‌లో 30 ఇండ్లు వర్షాల కారణంగా తుడిచి పెట్టుకుపోయాయని అన్నారు. రోడ్లు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారు. నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని ఆ గ్రామాలకు 50కోట్ల ప్రత్యేక ప్యాకేజీని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇండ్లు కోల్పోయిన వారికి 20లక్షలు, పంటనష్టపోయిన వారికి 10లక్షల ఆర్థిక సహాయం ఇవ్వాలని కోరారు. బోధన్ నియోజకవర్గంలో చాలాచోట్ల పంటలు దెబ్బతిన్నాయని ఆ గ్రామాలకు 10 కోట్లు విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. నిజామాబాద్ జిల్లాలో పర్యటించి నష్టపోయిన ప్రాంతాలను సందర్శించి బాధితులకు తగిన సహాయం అందించాలని బీజేపీ పార్టీ తరఫున కోరుతున్నానని తెలిపారు.

గోదావరి ఉరకలు..
ఎస్సారెస్పీలోకి 1.15లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

● ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా గోదావరిలోకి కొనసాగుతున్న నీటి విడుదల

మెండోర, సెప్టెంబరు, 3(ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి ఒక లక్ష 15వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు 39 వరద గేట్ల ద్వారా ప్రాజెక్టు ప్రధాన కాలువల ద్వారా ఒక లక్ష 26వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఎస్ఈ జగదీష్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నీటిమట్టం పూర్తి స్థాయిలో నిండటంతో ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటిని వచ్చినట్లు ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా ప్రాజెక్టు ప్రధాన కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి వరద పెరగడంతో 23 గేట్లను ఎత్తి గోదావరిలోకి లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి వరద కాలువ ద్వారా 18వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ 4500 క్యూసెక్కులు, ఉస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి 3500 వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. 666 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు 80.5 టీఎంసీలు కాగా బుధవారం సాయంత్రానికి 1089.8 అడుగులు 76 టీఎంసీల నీటినిల్వ ఉందని ఎస్ఈ తెలిపారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

ఇందల్వాయి,సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):మండలంలోని జీకే తండాలో వరద బాధిత కుటుంబాలకు నిత్యవసర సరుకులను తహసీల్దార్ వెంకట్రావ్ బుధవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదేశాల మేరకు వరదల్లో కూలిపోయిన ఇళ్లకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి, నష్టపరిహారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకట్రావ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మోహన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిపాల్ నాయక్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ బూక్యామోహన్, బడవత్ జైందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్యం దుకాణాల బంద్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి):గణేష్ నిమజ్జనం నేపథ్యంలో గురువారం మద్యం దుకాణాలు మూసి ఉంచాలని సీపీ సాయి చైతన్య ఆదేశాలు జారీ చేశారు. నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో 9వ రోజు గణేష్ నిమజ్జన శోభాయాత్ర జరుగుతుండటంతో ఆయా ప్రాంతాల్లో మద్యం దుకాణాలు మూసి ఉంచాలని ఆయా పోలీస్ స్టేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 4వ తేదీ ఉదయం 6గంటల నుంచి 5వ తేదీ ఉదయం 6గంటల వరకు మద్యం దుకాణాలు, బార్‌లు, కల్లు దుకాణాలు మూసి ఉంచాలని తెలిపారు.

వివాదాలే కత్తెర పోట్లకు దారి తీసింది

ధర్పల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి):భార్యభర్తల మధ్య నెలకొన్న మనస్పర్థల వల్లే కత్తిపోట్లకు దారి తీసిందని ధర్పల్లి సీఐ బిక్షపతి అన్నారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో కత్తెర పోట్లకు సంబంధించి వివరాలను ఆయన వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన కోటగిరి దాసు 2008లో నాగమణితో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడి పలుమార్లు పెద్దల సమక్షంలో చర్చలు జరిగినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. చివరకు భార్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విడాకుల నోటరీపై సంతకం చేయవల్సి వచ్చిందని సీఐ వివరించారు. ఆ తర్వాత వేరుగా దాసు జీవనం ప్రారంభించాడు. నింధితుడు తన భార్యను తనకు దూరం చేయడానికి కారణం మచ్చలక్ష్మి, బోజేశ్వర్ అని అనుమానం పెంచుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. వారిని చంపాలని నిర్ణయించుకొని దాదాపు నెలరోజుల పాటు అవకాశం కోసం ఎదురు చూశాడు. ఈనెల 2న ఉదయం 8 గంటలకు కత్తెర, కారంపొడి తీసుకొని లక్ష్మి ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేరని గమనించి లోపలికి వెళ్లినట్లు సీఐ చెప్పారు. లక్ష్మిని కత్తెరతో పొడవబోతున్నప్పుడు ఆమె కూతురు గౌతమి అడ్డు రాగా ఆమె సైతం గాయపడింది. తర్వాత లక్ష్మినిని తొడ, కాలి వద్ద పలు మార్లు పొడిచాడు. గౌతమి మళ్లీ అడ్డుకోవడంతో ఆమెను కూడా పొడిచాడు. అరుపులు విని పొరుగువారు నాగరాజు, శ్రీనివాస్, శోభలు వచ్చి అడ్డుకోవడంతో వారిపైన కూడా కత్తెరతో దాడి చేశాడు. ఆ తర్వాత బోజేశ్వర్ షాపుకు వెళ్లి అతనిపై కారం చల్లి కత్తెరతో దాడి చేశాడు. బోజేశ్వర్‌కు బుజం, మనికట్టు, చాతి, మెడ వద్ద గాయాలు అయ్యాయి. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలిస్తుండగా మచ్చలక్ష్మి చనిపోయినట్లు సీఐ వివరించారు. నింధితుడి కోసం గాలించి బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. సీఐ వెంట ఎస్సై కళ్యాణి ఉన్నారు.

పంట నష్టం వివరాలను పక్కాగా సేకరించాలి



నాళేశ్వర్‌లో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవీపేట,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు పక్కాగా సేకరించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. బుధవారం మండలంలోని లింగాపూర్, నిజాంపూర్, తుంగిని, నాళేశ్వర్, బినోల గ్రామాలలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. గోదావరి పరివాహక గ్రామాలలో వరదలు రావడంతో వరి, సోయాపంటలు దెబ్బతిన్నాయని ఆయన పేర్కొన్నారు. దీనికి తోడు మహరాష్ట్రలో సైతం అధికంగా వర్షాలు కురియడం, నిజాంసాగర్ ప్రాజెక్టుకు సుమారు 2లక్షల క్యూసెక్కుల వరకు వరద రావడంతో కూడా నష్టం మరింత పెరిగిందని ఆయన అన్నారు. పంట నష్టం వివరాలను సేకరించే సమయంలో ఒక్క ఎకరం కూడా తప్పిపోకుండా చూడాలని అధికారులకు సూచించారు. మండలంలోని బినోలలో 67 ట్రాన్స్‌ఫార్మర్లు, 10 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని ఆయన వివరించారు. తుంగిని మాటు కాలువ, నాళేశ్వర్ మాటు కాలువలలో పూడిక తొలగించడంతో పాటు కాలువలను వెడల్పు చేయాలని, నిజాంపూర్ ఎత్తిపోతల పథకానికి చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఇటీవల చోరీకి గురి కాగా నూతనంగా ట్రాన్స్ ఫార్మర్‌ను ఇప్పించాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. వరదల వల్ల తమ వలలు కొట్టుకుపోయ్యాయని, తమకు నూతనంగా వలలు ఇప్పించాలని నాళేశ్వర్‌కు చెందిన గంగపుత్రులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జడ్పీహెచ్ఎస్ బినోలకు చెందిన విద్యార్థులతో ఎమ్మెల్యే కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ రాంచందర్, శ్రీనివాస్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, కిషన్ రావు, బాల్‌రాజ్ గౌడ్, బుచ్చన్న, మానికేశ్వర్ రావు, నర్సింగ రావు, ప్రవీణ్ కుమార్, పోశెట్టి, సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులందరినీ ఆదుకుంటాం

- నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం..
- రోడ్ల మరమ్మతులకు రూ. 1.50కోట్లు
- ఆస్తుల కోసమే కవిత సస్పెన్షన్ :రూరల్ ఎమ్మెల్యే



కొండూరులో తెగిపోయిన వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సిరికొండ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరద బాధితులందరిని ఆదుకుంటామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి భరోసా ఇచ్చారు. సిరికొండ మండలంలో ఇటీవల వచ్చిన వరదల వల్ల నష్టపోయిన గ్రామాలను, బాధితులను పరామర్శించారు. పంట పొలాలను, వంతెనలను పరిశీలించారు. కొండూర్‌లో ఇళ్లు కూలిపోయిన బాధితులను సందర్శించి మాట్లాడారు. కూలిన ఇండ్లను చూసి ఎమ్మెల్యే చలించిపోయారు. కొండూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూపతిరెడ్డి మాట్లాడుతూ ఇండ్లు కూలిపోయిన బాధితులందరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని బాధితులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని ఆయన కోరారు. సిరికొండ మండలంలో వరదల వల్ల దెబ్బతిన్న పంచాయ తీరాజ్ రోడ్ల మరమ్మతులకు కోటిన్నర రూపాయలు మంజూరు అయ్యాయని ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు రెండున్నర కోట్లు మంజూరు అయ్యాయని, ఈ నిధులతో రోడ్ల మరమ్మతుల పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. నిజామాబాద్ ఎంపీ వరద బాధితుల పట్ల బాధ్యతారహితంగా మాట్లాడారని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వరదల వల్ల నష్టపోయిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు తీసుకొచ్చి మాట్లాడితే బాగుండేదని ఆయన హితవు పలికారు. సిరికొండ, ధర్పల్లి మండలాల్లో అధిక వర్షం కురవడం వల్ల ఒన్నాజీపేట్ చెరువు తెగిపోవడం వల్ల ఈ వరద నష్టాలు ఎక్కువగా జరిగాయని దీని నుంచి బాధితులు కోలుకునేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి, డీసీసీ కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, ఎర్రన్న, యువజన కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు ముత్తెన్న, సంపత్‌రెడ్డి, రాజారెడ్డి, నర్సారెడ్డి, దేగం సాయన్న, సంతోష్, జీవన్, ప్రవీణ్, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు నరేష్, పలు గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పంచాయతీరాజ్ డీఈ అహ్మద్ హుస్సేన్, తహశీల్దార్ రవీందర్‌రావు, ఎండీవో మనోహర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి నర్సయ్య, ట్రాన్స్‌కో, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ ఏఈలు, గృహ నిర్మాణ శాఖ ఏఈ తదితరులు ఉన్నారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తు కానరాని లోకానికి..

(5వ పేజీ తరువాయి)

క్షతగాత్రులిద్దరిని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇందులో శివ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో భైంసాలో ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్య సేవల కోసం నిజామాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. నీలిమకు భైంసాలోని ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఘటన స్థలి నుంచి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోకర్ ఆసుపత్రికి తరలించారు. బోకర్ సీఐ శైలేంద్ర ప్రమాద స్థలిలో ఘటనకు గల కారణాలపై విచారణ చేపట్టారు.

ఎరువుల కొరత లేకుండా చూసుకోవాలి..

(5వ పేజీ తరువాయి)

తెలుసుకున్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను చేపట్టేలా క్షేత్రస్థాయిలో పక్కగా పర్యవేక్షణ జరుపాలన్నారు. ఇటీవల గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించగా ఈ సదస్సులో వచ్చిన రైతుల భూసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కిరణ్మయికి సూచించారు. కలెక్టర్ వెంట విండో కార్యదర్శి తిరుపతిరెడ్డి, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఐదుగురు పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు సన్మానం

నిజామాబాద్ లీగల్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పబ్లిక్ ప్రాసిక్యూటర్లను బుధవారం తన కార్యాలయంలో సన్మానం చేశారు. మాక్లూర్, నవీపేట్, మెం డోరా, మోపాల్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, కోటగిరి పోలీస్ స్టేషన్లలో మొత్తం 15 హత్య కేసులలో 11 కేసుల నేరస్తులకు యావజ్జీవ కారాగార శిక్ష పడేటట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తెలిపారు. నాలుగు కేసుల్లో పదేళ్ల జైలుశిక్ష పడేటట్లు కేసులను వాదించారు. పలు పోలీస్ స్టేషన్లలో గల హత్య కేసులలో నేరస్తులకు జీవిత కారాగార శిక్ష పడేటట్లు చేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్‌పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వర్ రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ లక్ష్మీ నర్సయ్య, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వసంత్, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజారెడ్డి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యాంరావును పోలీస్ కమిషనర్ సన్మానించారు.

రాష్ట్ర దిశ కమిటీ సభ్యుడిగా దమ్మారెడ్డి ప్రదీప్

జిల్లా దిశా కమిటీ సభ్యులుగా నలుగురి నియామకం

నిజామాబాద్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

రాష్ట్ర అభివృద్ధి సమన్వయ కమిటీ (దిశా)సభ్యుడిగా ఇందల్వాయి మండలం అన్సాన్పల్లికి చెందిన ధర్మారెడ్డి ప్రదీప్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి ,వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ ఎంపీ అరవింద్ కు లేఖ ద్వారా తెలిపారు. రాష్ట్ర దిశా కమిటీతోపాటు జిల్లా దిశా కమిటీలో మెంబర్లను నియమించాలని ఎంపీ ధర్మపురి అరవింద్ కేంద్రమంత్రికి లేఖ రాయగా ఆయన ఆమోదిస్తూ తిరిగీ లేఖ పంపారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చైర్మన్ గా ఉండే రాష్ట్ర దిశా కమిటీ లో సభ్యుడిగా ధర్మారెడ్డి ప్రదీప్ నియమకం నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు అరవింద్ చైర్మన్ గా ఉండే జిల్లా దిశా కమిటీలో కొండ ఆశన్న, గజవాడ హనుమంతరావు, లింగంపల్లి లింగం , నేనావత్ విజయాలు సభ్యులుగా నియామకమయ్యారు. వీరు త్వరలో జరగనున్న దిశా కమిటీ సమావేశంలో పాల్గొననున్నారు. తమను దిశా కమిటీ సభ్యులుగా ప్రతిపాదించిన ఎంపీ అరవింద్ ధర్మపురికి ధన్యవాదాలు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరుసగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో, వరద ముంపుకు గురై వరదనీరు ఇండ్లలోకి చేరడంతో తాగునీరు కలుషితమై అనారోగ్యబారిన పడుతున్నారని డీఎంహెచ్‌వో రాజశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. కలుషిత నీటి ద్వారా అతిసారా, నీళ్ల విరేచనాలు, టైఫాయిడ్, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. స్వచ్ఛమైన కాచి చల్లార్చిన నీటిని తాగాలని అన్నారు. ఆహారం కలుషితం కాకుండా జాగ్రత్త పడాలన్నారు. వర్షాల కారణంగా ఏర్పడిన నీటి నిలువలో ఆయిల్ బాల్స్ వదలాలని, ప్రజలందరూ దోమ తెరలు వాడాలన్నారు. వర్షాల కారణంగా ఏర్పడిన వరదల వల్ల పాములు, తేళ్లు, క్రిమికీటకాలు, విషసర్పాల కాటుకు గురికాకుండా జాగ్రత్త పడాలన్నారు. జిల్లాలో వదరల వల్ల ఏర్పడిన ముంపు గ్రామాల్లో, పునరావాస కేంద్రాల్లో ప్రజలకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు చేసి చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా 59 ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించడం జరిగిందన్నారు. అందులో మొత్తం 2334 మంది రోగులను పరీక్షించి చికిత్స అందించడం జరిగిందని తెలిపారు.

వైరల్ హెపటైటిస్‌పై జిల్లా సమన్వయ కమిటీ సమావేశం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి):వైరల్ హెపటైటిస్‌పై డీఎంహెచ్‌వో రాజశ్రీ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమన్వయ కమిటీతో నేషనల్ వైరల్ హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రాంలో భాగంగా సమీక్ష నిర్వహించారు. హెపటైటిస్ బి వ్యాక్సినేషన్‌ను చేయడం పై డీఎంహెచ్‌వో అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి, పీహెచ్‌సీలో పనిచేస్తున్న సిబ్బంది హెపటైటిస్ వ్యాక్సినేషన్ చేయడంపై చర్చించారు. ఈ సమావేశంలో డాక్టర్ శ్రీనివాస్, ప్రసాద్, అశోక్, తుకారాం రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానను తనిఖీ చేసిన కలెక్టర్

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):డిచ్‌పల్లి మండలంలోని నడిపల్లి పల్లె దవఖానాను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. పల్లె దవాఖానాను సందర్శించిన కలెక్టర్ ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరును తనిఖీ చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. కలెక్టర్ స్థానిక అధికారులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సులో బ్యాటరీ నుంచి పొగలు



మంటలార్పుతున్న దృశ్యం

డి చ్ పల్లి,సెప్టెంబరు3 (ఆంధ్ర జ్యోతి):డి చ్ పల్లి మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న ఎలక్ట్రికల్ ఆర్టీసీ బస్సులో ఒక్కసారి పొగలు రావడంతో డ్రైవర్ బస్సును వెంటనే నిలిపివేశారు. నెంబర్ గల రెండవ డిపోఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు బ్యాటరీ నుంచి ఒక్క సారిగా పొగలు రావడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే ఆర్టీసీ బస్సును నలిపివే యడంతో ప్రయాణికులు పరు గులు తీస్తూ కిందికి దిగారు. బస్సులు కింది నుంచి పొగలు భారీగా రావడంతో స్థానికులు కూడా ఘటన స్థలానికి చేరుకున్నారు.ఇట్టి విషయాన్ని ఆర్టీసీ రెండవ డిపో మేనేజర్ సాయన్న ఆంధ్రజ్యోతితో ధృవీకరించారు. ఘటన స్థలాన్ని మేనేజర్ సాయన్న సందర్శించి బస్సును పరిశీలించారు. ఎలాంటి ప్రమాదం కాకపోవడంతో స్థాని కులు, ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

విద్యారంగ
సమస్యలపై సమరశీల ఉద్యమాలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశ సమగ్రతపై విద్యారంగ సమస్యలపై సమరశీల ఉద్యమాలు నిర్వహిస్తామని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఏ స్టాలిన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర 4వ మహాసభల ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బానోత్ రఘురాం అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ఉపాధ్యక్షుడు స్టాలిన్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో నవంబర్ 20 నుంచి 22 తేదీల్లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర 4వ మహాసభలు జరుగనున్నాయన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

నవీపేట,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. 29మంది లబ్ధిదారులకు సంబంధిత కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో 5, 8వ తరగతులకు అడ్మిషన్లు

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):మైనార్టీ గురుకుల పాఠశాల నాగారంలో 5 నుంచి 8 తరగతుల వరకు అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఆర్.కిరణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఉచిత విద్యతో పాటు ఉచిత వసతి అందించడం జరుగుతుందని తెలిపారు. క్రీడలతో పాటు అరబిక్ నేర్పిస్తారని తెలిపారు. మిగతా వివరాల కోసం 99486726862 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అయ్యో కోడలా..

(5వ పేజీ తరువాయి)

కవిత 2010లో నిజామాబాద్ అర్బన్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో తెలంగాణ జేఏసీ తరపున పోటీ చేసిన యెండల లక్ష్మీనారాయణ గెలుపులో కవిత కీలక పాత్ర పోషించారు. తెలంగాణ జాగృతి పేరుతో జిల్లాలోని ప్రతీ గ్రామంలో బతుకమ్మలు నిర్వహించిన ఘనత కవితది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఆమెకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. బీఆర్ఎస్ నుంచి ఆమెను సస్పెండ్ చేయడంతో ఆమె కొత్త పార్టీ పెడుతుందా, లేక ఇతర పార్టీలో చేరుతుందా అనే విషయంపై ఆమె సన్నిహితులు ఎదురు చూస్తున్నారు. ఏది ఏమైనా బీఆర్ఎస్‌లో ఆమె ప్రస్థానం ముగిసిన అధ్యయం.

కలిసిరాని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవి..

ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవి పొందిన నాయకులందరూ ఏదోఒక వివాదంలో చిక్కుకోవడం ఆ పదవి కలిసిరాదు అనడానికి సంకేతంగా నిలుస్తోంది. గతంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా అరికెల నర్సారెడ్డి ఒక్క ఓటు తేడాతో వెంకట్రామ్‌రెడ్డిపై గెలుపొందగా ఆ కేసు సుప్రీం కోర్టు వరకు వెళ్లింది. కేసు ఫలితం తేలేలోగా పదవీకాలం పూర్తయ్యింది. ఆ తర్వాత 2016లో ఎమ్మెల్సీగా ప్రస్తుత రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి గెలుపొందగా ఆ తర్వాత జరిగిన పరిణామాలతో ఆయన బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ కావడంతో ఎమ్మెల్సీ పదవి పోయింది. ఆ తర్వాత 2020లో కవిత ఎమ్మెల్సీగా గెలిచారు. తిరిగి 2022లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కవిత గెలుపొందారు. ఇంకా ఆమె పదవీకాలం మూడున్నర ఏళ్ల పాటు ఉండగా ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ నుంచి ఆమె కూడా సస్పెండ్ అయ్యారు. ఈ విధంగా నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవి పొందిన వారంతా వివాదాస్పదమవుతున్నారు.

మున్సిపల్ కార్పొరేషన్‌పై అవినీతి మరక

(5వ పేజీ తరువాయి)

అపార్ట్‌మెంట్ పై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడ్డారు.

కిందిస్థాయి సిబ్బందే కలెక్షన్ ఏజెంట్లు..

నిజామాబాద్ నగర పాలక సంస్థ అధికారులకు ఆదాయ వనరుగా మారింది. ఇక్కడ పనిచేస్తే దండిగా దండుకోవచ్చని గతంలో ఇక్కడ పనిచేసిన ఓ అధికారి మళ్లీ ఇక్కడికి పైరవీ ద్వారా పోస్టింగ్ తెచ్చుకొంటున్నారు. రెవెన్యూ విభాగంలో ఆదాయం ఎక్కువగా ఉండటంతో పట్టుబట్టి మరీ ఆ శాఖను తీసుకుంటున్నారు. కిందిస్థాయి సిబ్బందిని ఏజెంట్లుగా నియ మించుకొని వసూళ్లను కొనసాగిస్తున్నారు. బుధవారం జరిగిన ఏసీబీ ఘటన నుంచి ఆ అధికారి త్రుటిలో తప్పించుకున్నట్లు సమాచారం. అసలు సూత్రధారి ఆ అధికారే కాగా చివరి నిమి షంలో ఆర్ఐ డబ్బులు తీసుకుంటూ పట్టుబడినట్లు నగర పాలక సంస్థలో చర్చించుకుంటున్నారు. ఆయన రెండో సారి నగర పాలక సంస్థకు వచ్చినప్పటి నుంచి ఆయన తీరు వివాదాస్పదంగా ఉంటుంది. గతంలో ఏసీబీకి పట్టుబడిన నరేందర్ సైతం ఆర్ఐగా పనిచేశారు. ఏసీబీ చరిత్రలో అత్యధిక నగదుతో పట్టుబడ్డ నరేందర్ ప్రస్తుతం సెలవులో ఉన్నారు. ఆయన ఏసీబీకి పట్టుబడిన తర్వాత రెవెన్యూ విభాగంలో మొత్తం కొత్తవారే రాగా మళ్లీ ఆ విభాగంపై అవినీతి ఆరోప ణలు వస్తున్నాయి. ఏ పనికైనా డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో రెవె న్యూ విభాగం వివాదాస్పదమవుతోంది. బుధవారం సీనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జ్ ఆర్ఐ శ్రీనివాసచారి నగరానికి చెందిన ఓ మాజీ ఆర్మీ జవాన్‌కు ట్రేడ్ లైసెన్స్ జారీ విషయంలో రూ.10వేలు డిమాండ్ చేయగా ఆయన ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బుధవారం రెవెన్యూ విభాగంలో రూ.7వేలు లంచం తీసుకుంటూ ఆర్ఐ శ్రీనివాసచారీ రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు చిక్కాడు. 2021లో బోధన్‌లో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో శ్రీనివాసచారి రూ.2వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడగా జైలుకు సైతం వెళ్లి వచ్చాడు. ఏడాది క్రితం బోధన్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన శ్రీనివాసచారి తిరిగి ఏసీబీకి పట్టుబ డటం ఆయన అవినీతిని తెలియజేస్తుంది. ఈ సందర్భంగా ఏసీబీ అధికా రులు ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగితే 1064 ఫోన్ నెంబర్‌కు కాల్ చేయాలని ఏసీబీ ఇన్‌చార్జ్ డీఎస్పీ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు.

బాబోయ్... 'కష్ట'మ్స్..

(5వ పేజీ తరువాయి)

నుంచి పంపించడం ఆనవాయితీ. కాని ఈ మధ్య అమెరికా అధ్యక్షులు ట్రంప్ వ్యాఖ్యల కారణంగా పోస్టల్ సేవలు నిలిచిపోయాయి. దీని వల్ల అమెరికా దేశంతో పాటు అక్కడి రాష్ట్రాల్లో ఉన్న భారతీయులకు పోస్టల్ సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోధన్ పోస్టాఫీసు నుంచి నిత్యం ఉత్తరాలు, ముఖ్యమైన డాక్యుమెంట్లు, పార్సిళ్లు, స్పీడ్ పోస్టులు, నిత్యావసర మందులు వెళుతూ ఉండేవి. కాని ఇవి ప్రస్తుతం నిలిచిపోయాయి. న్యూయార్క్, లాస్‌వెగస్ తదితర ప్రాంతాల్లోని భారతీయులు అధికంగా ఉండే ప్రదేశాల్లో పార్సల్స్ ఎక్కువ గా వెళతాయి. దసరా, సంక్రాంతి, దీపావళి, క్రిస్మస్ తదితర పండుగల సమయంలో ఇక్కడి పిండి వంటలు అక్కడి భారతీయుల కోసం పోస్టళ్ల ద్వారా పంపిస్తారు. అరిసెల, శకినాలు, స్వీట్స్‌లతోపాటు పచ్చళ్లు తదితర వాటిని అక్కడి భారతీయుల పిల్లల కోసం పంపిస్తుంటారు. కాని ప్రస్తు తం అమెరికాకు పార్సిల్స్ నిలిపివేయడం వల్ల అక్కడ ఉండే భారతీయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మన దేశం నుంచి అక్కడ నివాసం, ఉద్యోగాలు చేసే వరకు ప్రతిరోజు అత్యవసరమైన ఔషధాలు అందడం లేదు. వాటితో పాటు అత్యవసర డాక్యుమెంట్లు, ఉత్తరాలు,స్పీడ్ పోస్టులు వెళ్లకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

కస్టమ్స్ రుసుం పెంచడమే కారణం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జులై 30న జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ (నెం. 14324) వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. ఈ కొత్త ఆదేశాల ప్రకారం, ఇప్పటివరకు 800 డాలర్ల వరకు ఉన్న వస్తువులపై కస్టమ్స్ డ్యూటీ మినహాయింపును రద్దు చేశారు. ఆగస్టు 29 నుంచి అమెరికాకు పంపే ప్రతి వస్తువుపై, దాని విలువతో సంబంధం లేకుండా కొత్త టారిఫ్ విధానం కింద కస్టమ్స్ సుంకం విధిస్తారు. అయితే, ఈ నిబంధనల నుంచి కొన్నింటికి మినహాయింపు ఇచ్చారు.

సినిమా గైడ్


దేవి : కొత్తలోక (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కూలీ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : బ్రహ్మాండ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : సుందరకాండ (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 : బ్రహ్మాండ (11.00, 10.30)
: కొత్తలోక (1.25, 4.25) : కూలీ (7.20)
స్క్రీన్-2 : కూలీ (1.35)
: సుందరకాండ (4.40, 10.30) : కొత్తలోక (7.30)
స్క్రీన్-3 : మహావతార్ నరసింహ (1.30, 4.30, 7.30, 10.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1 : కొత్తలోక (10.40, 7.25, 10.30)
: మహావతార నరసింహ (1.45, 4.35)
స్క్రీన్-2 : పరం సుందరి (హిందీ) (10.40, 1.35, 4.30, 7.25, 10.20)
స్క్రీన్-3 : త్రిబణదారి బార్బరిక్ (11.00, 7.30)
: కన్యాకుమారి (1.45)
: సుందరకాండ (4.35, 10.15)
స్క్రీన్-4 : కేపీ అగ్రహారంలో అంబేద్కర్ (10.05)
: అర్జున్ చక్రవర్తి (1.00)
: కూలీ (3.45, 10.50)
: వార్-2 (హిందీ) (7.15)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,08,400	రూ.1,00,100	రూ.1320

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.170	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	రూ.175	రూ.265	రూ. 285

